సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
బుధవారం, 18.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 146
పేజీలు: 12 వెల: రూ. 5

## అట్టుడికిన అసెంబ్లీ
09

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ.. రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య పేలిన మాటల తూటాలు
- కాంగ్రెస్ పాలనలో అన్ని అంశాల్లో అవినీతి జరుగుతోందన్న కేటీఆర్

ప్రజాప్రతినిధులందరూ డ్రగ్ టెస్టులు చేసుకోవాలి: టీపీసీసీ చీఫ్



## కొత్త రైతులకూ రైతు భరోసా
అప్లికేషన్ల స్వీకరణ ప్రారంభం 09



- ఈ నెల 25 వరకు అవకాశం
- వ్యవసాయ శాఖకు డిజిటల్ ఫైల్

## వరి బోనస్‌పై రూ.25వేలు ఆదా
మహిళలకు రూ. 57 వేల కోట్ల వడ్డీలేని రుణాలిచ్చాం




- బీఆర్ఎస్ నేతలకు ఆడబిడ్డలపై ఏమాత్రం గౌరవం లేదు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 09

## తుపాకీతో స్టంట్..
రీల్స్ మాయలో తనను తానే కాల్చేసుకున్నాడు..



- గుండెల్లోకి దూసుకెళ్లిన తూటా
- వ్యూస్ కోసం ప్రాణాలనే పణంగా పెట్టిన యువకుడు
- రీల్స్ స్టంట్ కాస్తా ప్రాణాంతకంగా మారిన ఘటన
- సరదా వీడియో కోసం గన్‌తో ఆట.. విషాదాంతం 03
- "కాల్చొద్దు" అన్న మాట వినకుండానే ట్రిగ్గర్ నొక్కిన పవన్

## కళ్లలో కారం కొట్టి రూ.కోటి లూటీ



- కూకట్‌పల్లిలో భారీ దారి దోపిడీ
- ఖండించిన పోలీసులు 03

# డ్రగ్స్ అస్త్రం.. రాజకీయ యుద్ధం


మొయినాబాద్ కేసుతో తెలంగాణ రాజకీయాల్లో హై టెన్షన్

డ్రగ్స్ వ్యవహారం బీఆర్ఎస్‌కు తలనొప్పిగా మారిందా?

### అసెంబ్లీకి ముందే డ్రగ్స్ కేసు రాజకీయ దుమారం
### కేటీఆర్‌పై కాంగ్రెస్ దాడి.. చాలెంజ్ తో హీట్

- వైట్ ఛాలెంజ్‌తో కేటీఆర్–కాంగ్రెస్ మాటల యుద్ధం
- అసెంబ్లీలో హాట్ టాపిక్‌గా మారనున్న డ్రగ్స్ ఇష్యూ
- డ్రగ్స్ అస్త్రంగా అధికార–ప్రతిపక్షాల పోరు
- టెస్టులకు సిద్ధమన్న కాంగ్రెస్.. తన జోలికి రావద్దన్న కేటీఆర్
- డ్రగ్స్ కేసు చుట్టూ తిరుగుతున్న తెలంగాణ రాజకీయాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న ముందు రోజే డ్రగ్స్ కేసు హైదరాబాద్ లో వెలుగు చూసింది. కేటీఆర్‌తో దగ్గర సంబంధాలు ఉన్న పైలట్ రోహిత్ రెడ్డి దొరకడాన్ని కాంగ్రెస్ అడ్వాంటేజ్‌గా తీసుకుంటోంది. డ్రగ్స్ కేసు రాజకీయ పేలుళ్లకు కారణం అవుతోంది. ఏపీలో ఎంపీ మహేష్‌ను పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని టీడీపీ ఆదేశించింది. వెంటనే చర్యలు తీసుకుంది. అయితే పైలట్ రోహిత్ రెడ్డి విషయంలో బీఆర్ఎస్ ఆలోచిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ వెంటనే కేటీఆర్‌ను టార్గెట్ చేసింది. ఆయనతో వైట్ చాలెంజ్ విసురుతోంది. కేటీఆర్ కూడా రివర్స్ చాలెంజ్ విసిరారు. అసెంబ్లీ సమాశాల్లోనూ ఇది హాట్ టాపిక్ అయ్యే అవకాశం ఉంది. గతంలోనూ డ్రగ్స్ అంశం రాజకీయంగా కీలకంగా మారింది. ఇప్పుడు మరోసారి అదే అంశం హాట్ టాపిక్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.
మొయినాబాద్ డ్రగ్స్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ ఇన్సిడెంట్‌గా మిగిలిపోకుండా, తెలుగు రాష్ట్రాల్లో పెను రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో మిగతా 02లో





## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
మంత్రి పొంగులేటి

- అక్రిడిటేషన్ కమిటీలో పరిగణలోకి జర్నలిస్టుల సూచనలు 09
- టీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




## జోరుగా ఇసుక దందా

- మహబూబ్ నగర్ జిల్లాలోని వాగులను తోడేస్తున్న ఇసుకాసురులు
- రెవెన్యూ, పోలీస్, ప్రజా ప్రతినిధుల అండతో ఇసుక దందా
- మూడు ప్రొక్లెయినర్లు.. 30 లారీలు అనే చందంగా సాగుతున్న ఇసుక రవాణా
- ఇసుక ఉన్న ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం రూ.లక్షలు సమర్పణ
- ఇసుక తరలింపు రోజు ఆయా మండల శాఖలకు రూ. 2 నుంచి మూడు లక్షల వరకు మామూళ్లు? 03



# మొయినాబాద్ టూ దుబాయ్
### పైలట్ ఫాంహౌస్‌లో ఇరాన్ యుద్ధం

- దుబాయ్ వ్యాపారంపై కీలక చర్చ
- మొయినాబాద్ ఫాంహౌస్ పార్టీ వెనుక దుబాయ్ కనెక్షన్ అనుమానాలు
- సాధారణ గ్యాదరింగ్ కాదు.. వ్యాపార చర్చల వేదికగా మారిన పార్టీ
- పోలీసుల దాడితో బయటపడుతున్న కొత్త కోణాలు
- కాల్పుల అనుమానం.. కేసుకు కొత్త మలుపు
- ప్రముఖుల హాజరు.. ప్లాన్ చేసిన సమావేశమా అన్న సందేహాలు
- కేదార్ మరణం తరువాత పెరిగిన అనుమానాలు
- బీఆర్ఎస్ అధినేత సీరియస్.. రోహిత్ రెడ్డికి షోకాజ్




### మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై సిట్

- రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో విచారణ
- మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో పార్టీపై దర్యాప్తు
- దుబాయ్ లింకులపైనా ఆరా 02
- 'పైలెట్'కు బీఆర్ఎస్ షోకాజ్

### డ్రగ్ పైలట్..? రోహిత్ రెడ్డే వ్యాపారి?

- గతంలోనూ విచ్చలవిడిగా పార్టీలు
- బడా వ్యాపారులకు డ్రగ్స్‌తో వీకెండ్ పార్టీలు
- పార్టీలు ఏర్పాటు చేసేది రోహిత్ రెడ్డే



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మొయినాబాద్ ఫాంహౌస్ పార్టీలో మరో కీలక విషయం వెలుగులోకి వస్తోంది. ఈ పార్టీ వెనక దుబాయ్ దందా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. దుబాయ్ వ్యాపారాల కోసమే ఈ పార్టీ జరిగిందని, దీన్ని రోహిత్ రెడ్డి ఏర్పాటు చేశారని తెలుస్తోంది. మొత్తంగా మొయినాబాద్ ఫామ్‌హౌజ్ ఘటన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో సంచనలంగా మారింది. టీడీపీ ఎంపీ, బీఆర్ఎమ్ ఎమ్మెల్యేలు మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా తాజాగా ఈ ఘటనలో మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కారణంగానే ఏపీ, తెలంగాణలో ఇద్దరు పార్టీల చీఫ్ లు వెంటనే స్పందించి, పార్టీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

**పోలీసుల ఎంట్రీతో హైడ్రామా**
హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌజ్‌లో జరిగిన పార్టీ ఒక్కసారిగా పెద్ద వివాదానికి మిగతా 02లో

## రంజాన్ వేళ రక్తపాతం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ దాడి..
- 400 మంది మృతి..
- ఖండించిన భారత్..
- అఫ్ఘన్ కు సంఘీభావం




యుద్ధం నిబంధనలను మరిచింది.. వైమానిక దాడులు మానవత్వాన్ని విస్మరించాయి. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో మాదక ద్రవ్య విముక్తి ఆస్పత్రి లక్ష్యంగా జరిగిన ఘోర వైమానిక దాడి అంతర్జాతీయ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. చికిత్స పొందుతున్న వందలాది మంది రోగులు నిద్రలోనే విగతజీవులయ్యారు. ఈ చర్యను భారత్ ఖండిస్తూ, ఇది అఫ్గాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి అని పాకిస్తాన్ తీరు పిరికిపంద చర్య అని అభివర్ణించింది. 09


## సన్‌రైజర్స్ హైదరాబాద్ సత్తా ఎంత?
ఐపీఎల్ 2026 రివ్యూ

- కమిన్స్ ఫిట్‌నెస్ సందేహం.. కెప్టెన్సీపై క్లారిటీ ఏంటి?
- హెడ్–క్లాసెన్–కిషన్ బలం.. బ్యాటింగ్ లైనప్ పటిష్టం
- బౌలింగ్‌లో అస్థిరత.. ఇదే పెద్ద బలహీనతా?
- డేనియల్ వెటోరి ట్రైనింగ్ ఫోకస్.. లోపాల సవరణపై దృష్టి
- పాత తప్పుల నుంచి పాఠాలు.. ట్రోఫీ లక్ష్యంగా సన్‌రైజర్స్

11



ఇరాన్‌తో యుద్ధం వేళ అమెరికా నేషనల్ కౌంటర్‌టెర్రరిజం సెంటర్ డైరెక్టర్ జో కెంట్.. ట్రంప్‌కు షాకిచ్చారు. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో అమెరికా యుద్ధం చేయడం నాకు ఇష్టం లేదు. ఇజ్రాయెల్, బలమైన అమెరికన్ లాబీ ఒత్తిడి వల్లే అమెరికా యుద్ధంలోకి దిగిందని బాంబు పేల్చారు.



**మలబద్ధకం నివారణకు**



**ఎక్కువగా నీరు తాగాలి**

రోజుకు కనీసం 2—3 లీటర్ల నీరు తాగడం వల్ల మలం మృదువుగా మారి సులభంగా బయటకు వస్తుంది.

# డ్రగ్స్ అస్త్రం.. రాజకీయ యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వెలుగులోకి వచ్చిన పేర్లు, ఆపై జరిగిన పరిణామాలు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి కేంద్రబిందువుగా మారాయి.

డ్రగ్స్ కేసును అస్త్రంగా చేసుకుని రాజకీయంగా పైచేయి సాధించేందుకు అటు ఏపీలోనూ, ఇటు తెలంగాణలోనూ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ కేసు ప్రకంపనలు రాగానే టీడీపీ అధిష్టానం అత్యంత వేగంగా స్పందించడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌ను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది తప్పు ఎవరిదైనా సరే, క్రమశిక్షణ విషయంలో రాజీ పడబోం అనే సంకేతాలను ప్రజల్లోకి పంపడం ద్వారా ప్రభుత్వం నైతిక విజయాన్ని సాధించే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉన్న పార్టీగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ద్వారా విపక్షాల నోళ్లు నొక్కేయవచ్చని టీడీపీ భావిస్తోంది.

**పైలట్ రోహిత్ రెడ్డిపై ఎలాంటి చర్యలు ప్రకటించని బీఆర్ఎస్**

తెలంగాణలో పరిస్థితి మరోలా ఉంది. ఫామ్ హౌస్ పార్టీలో రోహిత్ రెడ్డి పేరు వినిపించడం బీఆర్ఎస్‌ను ఇరకాటంలోకి నెట్టింది. పార్టీకి కీలక నేత కావడంతో బీఆర్ఎస్ అధిష్టానం చర్యల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. గతంలోనూ పలుమార్లు డ్రగ్స్ ఇష్యూస్ బీఆర్ఎస్ నేతల చుట్టూ తిరిగినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రోహిత్ రెడ్డి విషయంలో వేచి చూసే ధోరణి అవలంబించడం వల్ల ప్రతిపక్షాలకు విమర్శలు చేసేందుకు అవకాశం ఇచ్చినట్లయింది. తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్ ఈ అవకాశాన్ని అస్సలు వదులుకోవడం లేదు. గతంలో రేవంత్ రెడ్డి విసిరిన వైట్ ఛాలెంజ్ ను ఇప్పుడు మళ్ళీ తెరపైకి తెచ్చారు. కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ నేతలు డ్రగ్స్ టెస్టులకు సిద్ధమా అని సవాల్ విసురుతున్నారు. దీనికి ప్రతిగా కేటీఆర్ కూడా రివర్స్ ఛాలెంజ్ విసరడం, నాటి కేసుల ప్రస్తావన తీసుకురావడంతో రాజకీయం మరింత హీటెక్కింది. రాష్ట్రంలో డ్రగ్ ఫ్రీ తెలంగాణ నినాదాన్ని వినిపిస్తున్న కాంగ్రెస్, ఈ కేసు ద్వారా బీఆర్ఎస్ ముసుగు తొలగిస్తామన్నట్లుగా వ్యవహరిస్తోంది.

**అసెంబ్లీలో రాజకీయ యుద్ధం**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ డ్రగ్స్ ఇష్యూ ప్రధాన అస్త్రంగా మారే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పార్టీల్లో పాల్గొనడం, అందులో గన్ కల్చర్ చోటుచేసుకోవడం వంటి అంశాలపై ప్రభుత్వం గట్టిగా నిలదీసేలా కనిపిస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వంటి వారు ప్రతి 90 రోజులకు ఒకసారి టెస్టులు చేయాలనే ప్రతిపాదనలు తేవడం ఈ చర్చను మరింత ముందుకు తీసుకెళ్లేలా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ అంశం రాజకీయంగా కీలకం కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో జరిగిన టాలీవుడ్ డ్రగ్స్ కేసు, కొకైన్ స్కామ్స్ ఎన్నికల సమయంలో ఎంతో ప్రభావం చూపాయి. ఇప్పుడు మొయినాబాద్ కేసు ద్వారా మరోసారి అదే తరహా సెన్సేషన్ మొదలైంది. ఇది కేవలం ఒక పార్టీకే పరిమితం కాకుండా, అందరి చుట్టూ తిరుగుతుండటంతో రాబోయే రోజుల్లో రాజకీయ సమీకరణలు ఏ మలుపు తిరుగుతాయోనన్న ఆసక్తి నెలకొంది.

**డ్రగ్స్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డి రెడీ.. మరి కేసీఆర్, కేటీఆర్ వస్తారా ?**

డ్రగ్స్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అంతా సిద్ధమని, మరి కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా అని శాసనమండలిలో మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు. మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతుండగా.. దీనికి అసెంబ్లీ సమావేశాలు వేదికగా మారుతున్నాయి. ఈ అంశంపై శాసనమండలిలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. డ్రగ్స్ వ్యవహారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. టీపీసీసీ చీఫ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా డ్రగ్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రకటించారు. తొలి డ్రగ్స్ టెస్ట్ సీఎం రేవంత్ రెడ్డి చేయించుకుంటారని మహేష్ గౌడ్ అన్నారు.

**డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడీ.. కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా?**

'తెలంగాణ ప్రజలకు ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిపరం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది. డ్రగ్స్‌కు మేం వ్యతిరేకంగా అని చెప్పేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్ టెస్ట్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా కూడా డ్రగ్స్ పరీక్షలకు వస్తారు. మరి బీఆర్ఎస్ నేతలు డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా?. బీఆర్ఎస్ సభ్యులు తమ నాయకులైన ప్రతిపక్షనేత కేసీఆర్, కేటీఆర్‌లను కూడా డ్రగ్ టెస్టుకు తీసుకురాగలరా' అని మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు.

**మొయినాబాద్ డ్రగ్స్ కేసుతో సంబంధం లేదు..**

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, తప్పు చేయని వారు భయపడాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసును అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్న బీఆర్ఎస్ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. నేరస్తులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో శాసనమండలి దద్దరిల్లింది. రాజకీయ నేతల మధ్య మొదలైన ఈ 'డ్రగ్ టెస్ట్' వార్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ డ్రగ్స్ టెస్టుకు ఎవరు వస్తారో, ఎవరు దుమ్మా కొడతారని తెలంగాణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ షోకాజ్ నోటీసులు..**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్టానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని, ఈ కేసుకు సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నివేదిక సంతృప్తికరంగా లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, తుది నిర్ణయం వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. రాజకీయ సంచలనం సృష్టిస్తోంది.

**ఇప్పటికే కేటీఆర్ కౌంటర్ ఎటాక్**

మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ మాటల యుద్ధంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విసిరిన సవాల్‌కు కేటీఆర్ రెండు రోజుల కిందటే స్పందించారు.కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయని, కేటీఆర్ డ్రగ్స్ పరీక్షలకు సిద్ధం కావాలని మహేష్ కుమార్ గౌడ్ అంతకుముందు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కేటీఆర్, మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ తాను స్వీకరిస్తున్నానని, డ్రగ్స్ టెస్టుకైనా తాను సిద్ధమని ప్రకటించారు. రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు అందరూ స్వచ్ఛందంగా డ్రగ్స్ పరీక్షలు చేయించుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు, మాజీ ప్రజాప్రతినిధులు డ్రగ్స్ వాడటం దురదృష్టకరమని, వ్యక్తి గతంగా తాను డ్రగ్స్ వాడకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగించేది ఎంతటి వారైనా సరే, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. అదే సమయంలో, ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేసినా.. ఈ కేసులోకి లాగాలని చూస్తే కనుక చట్టపరమైన నోటీసులు ఇస్తానని కేటీఆర్ హెచ్చరించారు. కేటీఆర్‌పై గతంలో రేవంత్ రెడ్డి పలుమార్లు ఆరోపణలు చేశారు. తన బొచ్చు కూడా ఇస్తాను టెస్టులు చేపించుకోవాలని మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ బదులిచ్చారు. ఎలాంటి డ్రగ్స్ టెస్టులకైనా సిద్ధమేనని, అయితే నిరాధార ఆరోపణలు చేసినా, తన పరువుకు భంగం వాటిల్లేలా వ్యాఖ్యలు చేస్తే కనుక చట్టప్రకారం పరువు నష్టం దావా వేసి నోటీసులు పంపిస్తానని గతంలో చెప్పిన మాటలను కేటీఆర్ మరోసారి గుర్తుచేశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో డ్రగ్స్ పార్టీ నిర్వహించడంతో పార్టీకి చెందిన మరికొందరు నేతలు, కేటీఆర్ అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. డ్రగ్స్ తానెప్పుడూ తీసుకోలేదని, ఎప్పుడైనా సరే టెస్టులకు వెనుకాడనని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు.

# మొయినాబాద్ టూ దుబాయ్

(మొదటి పేజీ తరువాయి)

దారితీసింది. వీకెండ్ వేళ నిర్వహించిన ఈ గ్యాదరింగ్‌లో వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు పాల్గొనడం గమనార్హం. పోలీసులు అకస్మాత్తుగా దాడి చేయడంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. సాధారణ పార్టీ కాదనే అనుమానాలు వ్యక్తం అవుతుండగా, ఇందులో మరింత లోతైన అంశాలు ఉన్నాయా అన్న దానిపై విచారణ కొనసాగుతోంది. అంతేకాదు.. పోలీసులు ఇక్కడకు రాకుండా ఉండేందుకు కాల్పులు జరిపినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు చేశారని రిమాండ్ రిపోర్ట్ లో చెప్పుకొచ్చారు.

**దుబాయ్ లింకులు**

ఈ సమావేశం వెనుక అసలు ఉద్దేశం ఏంటి అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. ఇది కేవలం వినోద కార్యక్రమం కాకుండా కీలక అంశాలపై చర్చించేందుకు ఏర్పాటైన సమావేశమనే వాదనలు వినిపిస్తున్నాయి. పాల్గొన్న వారి నేపథ్యాలు, వారి మధ్య ఉన్న సంబంధాలు పరిశీలిస్తే.. ఇది ముందుగా ప్లాన్ చేసిన సమావేశంగా కనిపిస్తోందని అంటున్నారు. పోలీసుల రాకతో ఆ చర్చ మధ్యలోనే ఆగిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దుబాయ్ పేరు వినిపించడం మరింత ఆసక్తికరంగా మారింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా అక్కడి వ్యాపార వాతావరణం ప్రభావితం అవుతోందని విశ్లేషణలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన కొంతమంది ప్రముఖులు దుబాయ్‌లో పెట్టుబడులు పెట్టినట్లు గతంలో ప్రచారం జరిగింది. ఇప్పుడు ఆ పెట్టుబడుల భద్రతపై చర్చించేందుకే ఈ సమావేశం జరిగిందని అంటున్నారు. ముఖ్యంగా వ్యాపారవేత్త కేదార్ మరణం తర్వాత ఈ వ్యవహారం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఆ ఘటనకు ఈ సమావేశానికి సంబంధం ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. అందుకే దీనిపై ఇక్కడ కేసీఆర్.. అక్కడ చంద్రబాబు రియాక్ట్ అయినట్లు సమాచారం. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశంగా దీనిని పరిగణించినట్లు తెలుస్తోంది. దీంతో రోహిత్ రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, వారం రోజుల్లోగా పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వివరణ సరైనదిగా లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.



**అటు చంద్రబాబు కూడా..**

ఈ కేసులో తన పేరు వినిపించడంపై ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ స్పందించారు. తాను కేవలం స్నేహితుడి ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లినట్టు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా ఖండిస్తూ, ఎలాంటి అక్రమాలకు తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో ఈ ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా సీరియస్‌గా స్పందించారు. పూర్తి రిపోర్ట్ సమర్పించాలని ఆదేశిస్తూ, పార్టీ పరువు దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ వచ్చే వరకు రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# డ్రగ్ పైలట్?

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. మార్చి 16న కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. రోహిత్ రెడ్డి పిలిస్తేనే అందరూ పార్టీకి వచ్చారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరగడం ప్రజలను షాక్‌కు గురిచేసింది. మొయినాబాద్ ఫాంహౌస్‌లో మార్చి 14 రాత్రి జరిగిన పార్టీపై పోలీసులు దాడి చేసి 2 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకోగా, ఆరుగురికి డ్రగ్ టెస్టుల్లో పాజిటివ్ వచ్చింది. వీరిలో రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారి నమిత్ శర్మ, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.



**రిమాండ్ రిపోర్ట్‌లో ఏముంది?**

రోహిత్ రెడ్డి ముందుగానే వీకెండ్ డ్రగ్ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం ఇచ్చి, వ్యక్తులను ఆహ్వానించినట్లు పోలీసులు తెలిపారు. ఫాంహౌస్‌లో స్విమ్మింగ్ పూల్ దగ్గర మద్యం, కొకైన్‌తో పార్టీ జరిగినట్లు పేర్కొన్నారు. 2 గ్రాముల కొకైన్, లైసెన్సుతో ఉన్న .32 కాలిబర్ రివాల్వర్, బుల్లెట్లు, విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. నమిత్ శర్మ పోలీసులపై కాల్పులు జరిపినట్లు కూడా రిపోర్ట్‌లో ఉంది. ముగ్గురికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

**డ్రగ్ పెడ్లర్‌గా వ్యవహరించారా?**

ఈ పార్టీని రోహిత్ రెడ్డే ఏర్పాటు చేసి, 10 మందిని పిలిచాడని రిపోర్ట్ చెబుతోంది. కౌశిక్ రవి సిమ్లా నుంచి కొకైన్ తెచ్చి, ఒక్కో గ్రాముకు రూ.15 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. డబ్బు రోహిత్ డ్రైవర్ ఇచ్చినట్లు వెల్లడించాడు. దీంతో రోహిత్ రెడ్డి డ్రగ్ సరఫరాలో పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రగ్ టెస్టులో ఆయనకు కూడా పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ ఆయనను సస్పెండ్ చేసి వివరణ కోరింది.

**మునుపటి నుంచే డ్రగ్స్ వాడుతున్నారా?**

పార్టీలో పాల్గొన్న కొందరి నమూనాల్లో యాంఫిటమిన్, మెథాంఫిటమిన్ ఆనవాళ్లు లభించాయి. నమిత్ శర్మ, పుట్టా మహేష్ కుమార్ నమూనాల్లో ఇతర డ్రగ్స్ గుర్తించడంతో, గతంలోనూ డ్రగ్స్ తీసుకున్న అవకాశముందని పోలీసులు అనుమానిస్తున్నారు.

**డ్రగ్స్ పరిమాణంపై సందేహాలు**

కౌశిక్ రవి తాను కొకైన్ తెచ్చానని చెప్పినా, పోలీసులు స్వాధీనం చేసుకున్నది తక్కువే. మిగతా డ్రగ్స్ ముందే వినియోగించి ఉండొచ్చని భావిస్తున్నారు. అసలు నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

**రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు.. మత్తు పార్టీలు**

వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్ల కోసం కలుస్తూ, ఈ క్రమంలో డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడ్డారని పోలీసులు భావిస్తున్నారు.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై సిట్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రెండు తెలుగు రాష్ట్రాల్లో కలకలం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు మూలాలను, అంతర్జాతీయ సంబంధాలను ఛేదించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ఈ సిట్ తన విచారణను ప్రారంభించనుంది. ఈ బృందం మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీకి సంబంధించి లోతైన విచారణ జరగనుంది. ఆ పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు..? అక్కడ డ్రగ్స్ సరఫరా ఎలా జరిగింది..? అనే కోణంలో విచారణ కొనసాగుతుంది. ఈ డ్రగ్స్ దందాతో దుబాయ్‌కు ఉన్న సంబంధాలపై సిట్ ఆరా తీయనుంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాతో నిందితులకు ఉన్న పరిచయాలను వెలికితీయనున్నారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నమిత్ శర్మ రియల్ ఎస్టేట్ వ్యాపారాల ద్వారా డ్రగ్స్ మనీని ఎలా మళ్లించారనే అంశంపై సిట్ ఫోకస్ చేయనుంది. అక్రమ సంపాదనకు సంబంధించి ఆర్థిక లావాదేవీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అధికారిక ఉత్తర్వుల విడుదలతో సిట్ అధికారులు త్వరలోనే నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించే అవకాశం ఉంది. ఈ కేసులో మరికొంతమంది రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.




**'పైలట్'కు బీఆర్ఎస్ నోటీసులు**

మొయినాబాద్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ షాక్ ఇచ్చింది. డ్రగ్స్ వినియోగం జరిగినట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ మంగళవారం ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక సమావేశంలో మాదక ద్రవ్యాల వినియోగం జరిగిందని, ఆ సమయంలో రోహిత్ రెడ్డి అక్కడ హాజరై ఉన్నారనే మీడియా కథనాలను పార్టీ తీవ్రంగా పరిగణించింది. ఈ మొత్తం పరిణామాలపై 7 రోజుల్లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని పార్టీ ఆదేశించింది. ఇలాంటి అక్రమ కార్యకలాపాలతో సంబంధం కలిగి ఉండటం పార్టీ విలువలకు, ప్రతిష్టకు విరుద్ధమని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నోటీసు జారీ చేసినట్లు ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ పేర్కొన్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పార్టీ తుది నిర్ణయం తీసుకునే వరకు రోహిత్ రెడ్డి పార్టీ కార్యక్రమాలకు, అధికారిక సమావేశాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. గడువులోపు సంతృప్తికరమైన వివరణ ఇవ్వని పక్షంలో, ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే పార్టీ రాజ్యాంగం ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రభుత్వం ఇప్పటికే ఈ కేసుపై 'సిట్' ఏర్పాటు చేసిన తరుణంలో సొంత పార్టీ కూడా రోహిత్ రెడ్డిపై చర్యలకు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# స్ఫూర్తి ప్రదాతలకు నివాళి

**ముద్ర , మెహిదీపట్నం:** ఇటీవల మరణించిన ప్రముఖ సాహితీ వేత్త ముక్తవరం పార్థసారథికి, సంఘ సేవకుడు, వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అంజిరెడ్డికి నేతాజీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఘనంగా నివాళులు అర్పించింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సంస్మరణ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ వారి సేవలను స్మరించుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, ముద్ర ఎడిటర్ వై నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు జి అప్పారావు, మాజీ అధ్యక్షులు సత్యంబాబు, టీఎస్ ఆనంద్ రెడ్డి, హౌసింగ్ సొసైటీ కార్యదర్శి కృష్ణమూర్తి, అసోసియేషన్ కోశాధికారి అమర్నాథ్ రెడ్డి, సంజీవరెడ్డి, ఆంజనేయస్వామి, ప్రముఖ ఆర్టిస్ట్ అన్వర్ తదితరులు మాట్లాడుతూ పార్థసారథి మృతి తెలుగు సాహితీ రంగానికి తీరని లోటని అన్నారు. 15వ ఏటనే రచనలు ప్రారంభించిన పార్థసారథి తన 81 ఏళ్ల జీవితంలో రాసిన కథలు, నవలలు, అనువాదాలు 70 పైగా ప్రచురితమయ్యాయని వారు అన్నారు. నిరాడంబరమైన జీవితం గడిపిన పార్థసారథి రచనలే ఊపిరిగా బతికారని, సామాజిక స్పృహ కల్పించే రచనలు చేశారని వారు ప్రశంసించారు.

వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి నేతాజీ నగర్ కాలనీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ లో పనిచేసిన అంజిరెడ్డి 25 ఏళ్ల పాటు ఉద్యోగ సంఘం నాయకుడిగా సేవలందించారని పేర్కొన్నారు. గొప్ప స్నేహశీలి అయిన అంజిరెడ్డి కాలనీ వాసుల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి సతీమణి వసంత, అంజిరెడ్డి కుమారులు నరేంద్ర రెడ్డి, ఉజ్వల్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రెడ్డి, కార్యదర్శులు కే శ్రీధర్, ఎంవీ రంగారెడ్డి, అసోసియేషన్ నాయకులు సురేందర్ రావు, డాక్టర్ వరప్రసాద్, వెంకటేశ్వర్లు శ్రీనివాసరావు, పూర్ణచంద్రావు తదితరులు పాల్గొని పార్థసారథి, అంజిరెడ్డిలకు నివాళులు అర్పించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. వారి సంస్మరణార్థం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.



# 20న కేబినెట్ భేటీ

## అసెంబ్లీ కమిటీ హాల్ లో బడ్జెట్ ఆమోదం
## ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర మంత్రివర్గ ఈ నెల 20న భేటీ కానుంది, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉ.9.30 గంటలకు సమావేశం కాబోతోంది. ఈ భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు దానికి మంత్రివర్గ ఆమోదం తెలపడం ఈ సమావేశం యొక్క ప్రధాన అజెండాగా ఉంది.



దీంతో పాటు రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోతున్న నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో ఎలాంటి పథకాలు ఉండబోతున్నాయి? అనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### మలబద్ధకం : ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోవాలి

గోధుమలు, ఓట్స్, పప్పులు, ఆకుకూరలు, పండ్లు (బొప్పాయి, అరటి) తీసుకో-వడం వల్ల పేగుల కదలికలు మెరుగుపడతాయి.



# సిద్దిపేటపై ఈర్ష్యాద్వేషాలే..

- అభివృద్ధిపై కక్షతో ఎలా అడుగుపెడతావు రేవంత్ రెడ్డి?
- నిధుల రద్దుపై హరీశ్ రావు ఆగ్రహం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

నువ్వు ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా సిద్దిపేటపై ఈర్ష్యాద్వేషాలే చూపుతున్నావా అంటూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఈ నెల 22న నంగునూరు మండలం నర్మేట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న నేపథ్యంలో హరీశ్ రావు పలు ప్రశ్నలు సంధించారు. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట అభివృద్ధి పనుల కోసం విడుదలైన రూ. 1,070 కోట్ల నిధులను ఎందుకు రద్దు చేశావని ప్రశ్నించారు. ఆ నిధులను పునరుద్ధరించి సిద్దిపేట నియోజకవర్గంలో అడుగుపెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. సీఎం ప్రారంభించబోతున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీకి నిధులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే మంజూరు చేశామని గుర్తుచేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన 27 నెలల తర్వాత సిద్దిపేట నియోజకవర్గంలో అడుగుపెడుతున్నందుకు స్వాగతిస్తున్నానని, కానీ గతంలో సిద్దిపేటపై చూపిన వైఖరిని ప్రజలు గుర్తుంచుకుంటారని లేఖలో పేర్కొన్నారు. రద్దు చేసిన నిధులను వెంటనే పునరుద్ధరించి, పనులను పూర్తిచేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు.



# కళ్లలో కారం కొట్టి రూ.కోటి లూటీ

- కూకట్‌పల్లిలో భారీ దారి దోపిడీ
- 24 గంటల్లోనే ముఠా అరెస్ట్

**ముద్ర కూకట్‌పల్లి :**

హైదరాబాద్ కూకట్ పల్లిలో పెద్ద మొత్తంలో నగదు దోపిడీ జరిగింది. ద్విచక్ర వాహనంపై బాక్సులో రూ.కోటి నగదు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి గుర్తు తెలియని మరో నలుగురు ఆగంతకులు దోచుకుపోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. బహదూర్‌పురాకు చెందిన కుస్రు, అజీముద్దీన్ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై డబ్బు తీసుకెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. కూకట్ పల్లి మెట్రో పిల్లర్ నెంబర్ 836 వద్దకు చేరుకోగానే 2 బైకులపై నలుగురు దుండగులు వచ్చి వారిని అడ్డగించారు. అనంతరం వారి కళ్లలో కారం చల్లి, వారి వద్ద ఉన్న కోటి రూపాయల నగదును లాక్కొని పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**24 గంటల్లోనే ముఠా అరెస్ట్**

కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి మహ్మద్ ఖుస్రోద్దీన్ (A4) సహా నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 77.78 లక్షల నగదు, 5 సెల్ ఫోన్లు, ఒక హోండా యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు.

**పథకం ప్రకారం దోపిడీ..**

పాతబస్తీకి చెందిన ఖుస్రోద్దీన్ 'సిద్రా ఎంటర్‌ప్రైజెస్'లో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తూ, యజమాని సూచన మేరకు హవాలా నగదును సేకరిస్తుంటాడు. యజమాని చేసేవన్నీ అక్రమ లావాదేవీలని, ఆ డబ్బును కొట్టేసినా పోలీసులకు ఫిర్యాదు చేయలేరని భావించి, తన స్నేహితుడు ఒమర్ షరీఫ్ (A1)తో కలిసి దోపిడీకి స్కెచ్ వేశాడు. మార్చి 17న కూకట్‌పల్లిలో కోటి రూపాయలు తీసుకుని బాధితులు వస్తుండగా, నిందితులు వారి కళ్లలో మిరపపొడి చల్లి నగదుతో పరారయ్యారు. నిందితులు విమానంలో లక్నోకు పారిపోయేందుకు ప్రయత్నించారు. సంఘటనా స్థలంలో నిందితులు వదిలేసిన బైక్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు శంషాబాద్ విమానాశ్రయంలో ఉండగా, కూకట్‌పల్లి డీసీపీ రీతిరాజ్ నేతృత్వంలోని బృందం వారిని అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో మహ్మద్ ఒమర్ షరీఫ్ (A1), మహ్మద్ గౌస్ సద్దాం (A2), అబ్దుల్ హమీద్ (A3), మహ్మద్ ఖుస్రోద్దీన్ (A4) ఉన్నారు. ప్రస్తుతం చోటు, సల్మాన్, గౌస్ తో పాటు మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీస్ బృందాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# రీల్ రివర్స్

- తుపాకీతో స్టంట్.. గుండెల్లోకి దూసుకెళ్లిన తూటా
- రీల్స్ మాయలో తనను తానే కాల్చేసుకున్న యువకుడు



**ముద్ర డెస్క్ :**

జనంలో రీల్స్ పిచ్చి రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతోంది. వ్యూస్ కోసం కొందరు ప్రాణాలను పణంగా పెడుతున్నారు. తాజాగా ఢిల్లీలో అలాంటి ఘటనే చోటుచేసుకుంది. తుపాకీతో స్టంట్ చేయబోయి ఓ యువకుడు మృతి చెందాడు. లోడ్ చేసిన గన్‌తో రీల్ చేస్తుండగా.. అది పేలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మృతుడిని తూర్పు ఢిల్లీకి చెందిన పవన్‌గా గుర్తించారు. పవన్ ఈ రీల్ చేస్తుండగా పక్కనున్న స్నేహితుడు దాన్ని రికార్డ్ చేశాడు. బటన్ ఎలా నొక్కాలో మిత్రుడు చెబుతుంటే.. పవన్ తుపాకీని లోడ్ చేశాడు. ఆ తర్వాత గన్‌ను ఛాతీకి గురిపెట్టుకొని కెమెరా వైపు చూసి నవ్వాడు. వీడియో రికార్డు చేస్తున్న వ్యక్తి 'కాల్చొద్దు అన్నా..' అని చెప్పినప్పటికీ.. పవన్ కంగారులో ట్రిగ్గర్ నొక్కేశాడు. దీంతో బుల్లెట్ గుండెల్లోకి దూసుకెళ్లి.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ తుపాకీ వీడియో రికార్డు చేసిన పవన్ స్నేహితుడిదేనని పోలీసులు తెలిపారు. దానికి లైసెన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





# అక్రమార్కులకు కాసుల వర్షం

- రెవిన్యూ, పోలీస్, ప్రజా ప్రతినిధుల అండదండలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ప్రజావాణి లో ఫిర్యాదుతో బయటపడుతున్న ఇసుక బాగోతం
- ఫిర్యాదులు వచ్చినా కానరాని నియంత్రణ

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

ఇసుక దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వాగులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారుతున్నాయి. కొంతమంది వ్యాపారులు అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూ, పోలీస్, ప్రజా ప్రతినిధుల అండదండలు వారికి పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ప్రోక్లయిన్లు, బెంజ్ లారీ లను ఉపయోగించి ఇసుకను ఇతర జిల్లా సరిహద్దులను దాటిస్తున్నారు. ఈ విషయాలు ప్రజా వాణి ఫిర్యాదు ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్య లు లేవని వాగుల పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లా లోని భూత్పూర్, మూసా పేట, కోయిల కొండ, మిడ్జిల్ మండలాల్లో ఇసుక దందాలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఈ మండలాల్లో వేసవి వచ్చిందంటే చాలు వాగుల్లో ఉన్న ఇసుక పై అధికారుల అండతో అక్రమార్కులు రాబందుల్లా వాలుతున్నారు. భూత్పూర్ మండలం లోని మొల్గర వాగు నుంచి, మిడ్జిల్ మండలం దుందుబీ వాగు, మూసాపేట మండలం లోని పెద్ద వాగు, దేవరకద్ర నియోజకవర్గం లోని ఊకచెట్టి వాగు, నారాయణ పేట నియోజకవర్గం లోని కోయిల కొండ సూరారం వాగు ఇసుక తోడేళ్లకు ఇక్కడి ఇసుక కాసులు కురిపిస్తోంది. రాత్రి సమయంలో ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాల్లో డంప్ చేసిన తరువాత అక్కడి నుంచి జిల్లా సరిహద్దులను దాటిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కోయిల కొండ రెవిన్యూ అధికారులపై నేరుగా జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఇక్కడ నుంచి ఇసుక తరలించే రోజు రెవిన్యూ, పోలీస్ శాఖలకు రూ.2 నుంచి 4 లక్షలు ముడుపులు అందుతున్నాయని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోలేదు. గత సోమవారం భూత్పూర్ మండలానికి చెందిన పలువురు మొల్గర వాగులో ఇసుక తరలింపు పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా 100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన తరువాత అక్కడి నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ కు వివరాలు అందితే, వారి వివరాలను ముందుగానే మాఫియాకు చేరవేస్తున్నారనే ఆరోపణలు గ్రామస్థులు చేస్తున్నారు. దీంతో ఫిర్యాదు చేసిన వారిపై మాఫి యా గ్యాంగ్ బెదిరింపులకు దిగుతోంది. స్థానిక పోలీసుల అండ ఉందనే ధీమాతో మాఫియా సభ్యులు మరింతగా రెచ్చిపోతున్నారని వారు చెబుతున్నారు.

**పడిపోతున్న భూగర్భ జలాలు :**

పాలమూరు జిల్లా అంటేనే కరువు కు కేరాఫ్ గా ఉంది. ఈ కరువు జిల్లా లో భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఇక్కడి రైతులు అధికంగా బోరు బావుల పైనే ఆధారపడి పంటలు పండిస్తారు. ప్రధాన నీటి వనరులు ఇక్కడ బోరు బావులే. చెరువులు, కుంటలు ఉన్నా అవి వర్షా కాలానికే పరిమితం అవుతాయి. యాసంగి పంట సాగుకు బోరు బావులే ప్రధాన నీటి వనరులు. ఒక్క గద్వాల జిల్లా కు మాత్రం జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుతుంది. మహబూబ్ నగర్ జిల్లా లో మాత్రం పంటల సాగుకు బోరు బావులే దిక్కు. ప్రస్తుతం వాగుల పరిసర గ్రామాల్లో ఇసుక తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది జనవరి లో గ్రౌండ్ లెవల్ 7.85 మీటర్లు ఉంటే ఈ ఏడాది జనవరి నాటికి 6.26 మీటర్లు గ్రౌండ్ లెవల్ గా ఉన్నాయి. 2024 కంటే 2025 లో వర్షపాతం ఎక్కువగా నమోదైంది. అయినా భూగర్భ జలాలు ఇంత త్వరగా పడిపోవడానికి వాగుల్లో ఇసుక తరలించడమే అని నీటిపారుదల శాఖ అధికారులు అంటున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు కళ్లు తెరిచి ఇసుక రవాణాను అడ్డుకుని భూగర్భ జలాలను కాపాడాల్సిన అవసరం ఉంది.

# ప్రాణాపాయం నుంచి కాపాడే అవకాశం

- డ్రగ్- రెసిస్టెంట్ టిబి నిర్ధారణ కిట్లను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

**ముద్ర, హైదరాబాద్ :**



డ్రగ్ రెసిస్టెంట్ క్షయవ్యాధి నిర్ధారణ కోసం ఆధునిక డయాగ్నస్టిక్ కిట్ల తయారీలో తెలంగాణ రాష్ట్రం తాజాగా ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య వ్యవస్థలకు ఔషధాలకు లొంగని ప్రాణాంతక క్షయవ్యాధి పెను సవాలుగా మారిందని ఆయన తెలిపారు. దీనిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. మంగళవారం ఆయన శాసనసభ కమిటీ హాల్ లో హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో తయారైన డ్రగ్ రెసిస్టెంట్ క్షయ వ్యాధి కిట్లను ఆవిష్కరించారు. ఫ్రెంచ్ డయాగ్నటిక్స్ దిగ్గజం బయోమెరియో ఈ కిట్ల ఉత్పత్తిని ప్రారంభించింది. బెంగళూరులోని ఫ్రెంచ్ రాయబార కార్యాలయ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ, ఆరోగ్య, సామాజిక వ్యవహారాల కౌన్సిలర్ చార్ల్స్ మహీ, బయోమెరియో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అలెగ్జాండర్ మెరియో ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. టిబి వ్యాధి నిర్మూలన దిశగా దేశం చేసున్న ప్రయత్నాలకు సహకరిస్తున్న బయోమెరియో యాజమాన్యాన్ని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు ప్రశంసించారు. 1963లో స్థాపించిన బయోమెరియో ఇన్‌విట్రో డయాగ్నస్టిక్స్ రంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థగా గుర్తింపు పొందింది. సుమారు 4 బిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ. 36 వేల కోట్ల) వార్షిక టర్నోవర్ తో, 160 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అంటువ్యాధులు, క్యాన్సర్, ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ రంగాల్లో వినూత్న డయాగ్నస్టిక్ పరిష్కారాలను అందిస్తోంది. జినోమ్ వ్యాలీలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంటు కోసం బయోమెరియో మొదటి దశలో రూ.50 కోట్లు వ్యయం చేసింది. ఇందులో 100 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. త్వరలో ఇక్కడ పరిశోధన, అభివృద్ధి లేబరేటరీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ వెల్లడించింది. కార్యక్రమంలో తెలంగాణా లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ సర్వేశ్ సింగ్ కూడా పాల్గొన్నారు.

**నివేదిక అందజేత**


ఈ సందర్భంగా ఇండో ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (IFCCI) రూపొందించిన రెండు దేశాల వాణిజ్య సంబంధాల నివేదికను కాన్సుల్ జనరల్ మంత్రి శ్రీధర్ బాబుకు అందజేసారు. తెలంగాణా అభివృద్ధిలో ఫ్రెంచ్ సంస్థల భాగస్వామ్యాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది.

# ఉపాధి కల్పనే లక్ష్యం

## తెలంగాణ యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

- యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు
- విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ
- టి-సాట్ లైవ్ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి

**ముద్ర, శేరిలింగంపల్లి :**



తెలంగాణ యువత కోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతికతకు అనుసంధానం చేస్తూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 'యూజీ అండ్ పీజీ కోర్సెస్ న్యూ అండ్ ఎమెర్జింగ్ ఏరియాస్' అనే అంశంపై మంగళవారం టి సాట్ వేదికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి తాము ప్రతిపాదించే కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు తమ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలలను నిజం చేసేందుకు తెలంగాణలోని అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం సుమారు 39 కోర్సులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి విజన్ లో భాగమైన 2047 లక్ష్యాన్ని పూర్తి చేసే ప్రయత్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను రూపొందించామన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 19 కోర్సులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం మరో 10 కోర్సులను తక్షణమే ఉపాధి కల్పించేవిగా ఆచరణలోకి తేబోతున్నామని, ఏఈడీపీ (అప్రెంటీస్ ఎనేబుల్డ్ డిగ్రీ ప్రొగ్రామ్స్) లో భాగంగా మరో 10 కోర్సులు ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు. 2030 సంవత్సరానికీ మూడు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి పబ్లిక్ అండ్ ప్రయివేటు భాగస్వామ్యంతో తెలంగాణలోని వివిధ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ ఉద్యోగాలను సాధించేందుకు తెలంగాణ యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి పనిచేస్తుందని బాలకృష్ణారెడ్డి వివరించారు. కళాశాలల్లో క్యాలిటీ టీచింగ్, మానిటరింగ్, అకడమిక్ పార్టిసిపేషన్, రీసెర్చ్ తదితర అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఛైర్మన్ సూచించారు. వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి ప్రత్యేక కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలకు, ఆయా కళాశాలకు తగిన సలహాలుసూచనలు అందిస్తున్నామన్నారు. మండలి మరో వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో పాటు నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎన్ని ఉన్నత చదువులు చదివినా నైపుణ్యం లేని చదువువల్ల ప్రయోజనం, ఉపాధి రెండూ ఉండవన్నారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ యూనివర్సిటీ లేదా కళాశాల తాము నిర్వహించే కోర్సులకు సంబంధించి ఖచ్చితంగా ల్యాబ్స్ నిర్వహించాలని సూచించారు. కొత్త కోర్సులు ప్రారంభించి వదిలివేయడమే కాకుండా వాటిపై తప్పని సరిగా తమ వైపు నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
18.03.2026 బుధవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




## నల్లబజారు ఉచ్చులో సామాన్యుడి వంటగది!

భారతదేశంలో ఇంధన భద్రత కేవలం ఆర్థిక అంశం కాదు, సామాజిక స్థిరత్వానికి కూడా కీలకం. ప్రస్తుతం ఎల్పీజీ సంక్షోభం నేపథ్యంలోదేశంలోనల్లబజారు పెరుగుతూ, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కొరత లేదని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో సిలిండర్లు అధిక ధరలకు అమ్ముడవుతున్నాయి. అంతర్జాతీయ సరఫరా అంతరాయాలు, కొత్త వనరుల అన్వేషణలో ఆలస్యం దేశీయ నిల్వలపై ఒత్తిడిని పెంచాయి. గృహ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలనే నిర్ణయం సిద్ధాంతంగా మంచిదైనా, ఆచరణలో సమస్యలు తెచ్చింది. వాణిజ్య వంటశాలలకు సరఫరా తగ్గించడం వల్ల అవి అక్రమ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీని వల్ల గృహ సబ్సిడీ సిలిండర్లు నల్లబజారుకు మళ్లుతున్నాయి. డిమాండ్‌సరఫరా అసమతుల్యత కారణంగా "స్కార్సిటీ ప్రీమియం", "రిస్క్ ప్రీ మి యం " ల తో ధరలు రెట్టింపు అవుతున్నాయి. గతంలో 1970-80ల కొరత కాలం పరిస్థితులు మళ్లీ కనిపిస్తున్నాయి. ప్రభుత్వ అధిక జోక్యం, పారదర్శకత లోపం సమస్యను మరింత పెంచుతున్నాయి. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి ప్రభుత్వం సరఫరా పెంపు, కొత్త దిగుమతి వనరుల అన్వేషణపై దృష్టి పెట్టాలి. ధరలను హేతుబద్ధీకరించడం ద్వారా నల్లబజారును తగ్గించవచ్చు. అలాగే గ్యాస్ పంపిణీలో పారదర్శకత పెంచేందుకు డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలు అవసరం. కేవలం నియంత్రణలతో సమస్య పరిష్కారం కాదు; మార్కెట్ వాస్తవాలను గుర్తించి సమతుల్య విధానాలు అవలంబించాలి. లేదంటే ఈ సంక్షోభం సామాన్యుడి జీవితానికే కాకుండా రాజకీయంగా కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863





## ఎండా కాలంలో తలెత్తే హీట్ స్ట్రోక్ నుండి జాగ్రత్త

**ఎండలు మండుతున్నాయి టెంపరేచర్ పెరుగుతూ ఉంది ఎండాకాలంలో దాహం, నీరసం, వేడిగాలులు, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో శరీర ఉష్ణోగ్రత పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ సీజనులో ఆరోగ్యంగాతట్టుకోవచ్చు. ముఖ్యమైన ఎండాకాలం జాగ్రత్తలు*ఎక్కువగా నీరు త్రాగండి రోజుకు కనీసం 5 లీటర్ల నీరు తాగాలి శరీరంలో నీటి సమతుల్యం నిలబెట్టడానికి ఇది అవసరం. చల్లని నీరు, కొబ్బరి నీరు మంచివి. డీహైడ్రేషన్ నివారించడంలో ఇది కీలకం. గొంతు ఎండకుండా ఉండేందుకు తరచూ తాగాలి.**

**ప్రత్యక్షంగా ఎండలో ఉండకండి**

ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు వేడి ఎక్కువగా ఉంటుంది.ఈ సమయంలో బయటకు వెళ్లకూడదు, ఎండల వల్ల హీట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అత్యవసరమైతే టోపీ, కళ్లద్దాలు వాడాలి. నీడలో నడవడం మంచిది.

లైట్ మరియు కాటన్ దుస్తులు వేసుకోండి.పొడి గాలి ద్వారా శరీర ఉష్ణోగ్రత పెరగకుండా ఉండేందుకు కాటన్ దుస్తులు ఉపయోగపడతాయి. ఇవి శరీరానికి హితమైనవిగా ఉంటాయి. బహుళ రంగు లేదా గాఢమైన దుస్తులు వేడి ఎక్కువగా ఇస్తాయి. తెలుపు లేదా లైట్ కలర్స్ ఉత్తమం. ఇది చల్లదనం కలిగిస్తుంది..

**చల్లదనాన్ని ఇచ్చే ఆహారం తీసుకోండి**

వెల్లుల్లి, పెరుగు, తాటి ముంజలు, పుచ్చకాయలు వంటి పదార్థాలు శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. వీటిలో నీరు అధికంగా ఉండడం వల్ల వేడి తగ్గుతుంది. బాహ్య ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించేందుకు సహాయపడతాయి.రోజు ఆహారంలో ఇవి ఉండేలా చూసుకోవాలి.

**మసాల మరియు జంక్ ఫుడ్ మానేయండి**

వేడి కాలంలో ఎక్కుమసాలా వంటకాలు, చిప్స్, ఫ్రైడ్ రైస్ తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఇవి శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. పెరుగు అన్నం,వంటి వాటిని ప్రిఫర్ చేయాలి.

**సన్ స్క్రీన్ ఉపయోగించండి**

వేడికిరణాల ప్రభావం నుంచి చర్మాన్ని కాపాడటానికి సన్స్క్రీన్ అవసరం. కనీసంఎస్. పి. ఎఫ్ 30 కలిగినది వాడాలి. వీటిని బయటకు వెళ్లేముందు 30 నిమిషాల ముందు అప్లై చేయాలి, చర్మాన్ని రక్షించడం వల్ల అలర్జీలు, టాన్ తప్పుతుంది.

**ఆహారాన్ని మానవద్దు**

ఎండాకాలంలో ఆకలిలేకపోవడం సాధారణం అయినా, సమయానికి ఆహారం తినాలి. బాడీలో ఎనర్జీ తగ్గకుండా ఉండేందుకు ఇది అవసరం. ప్రోటీన్, మినరల్స్, కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవాలి. బలహీనత, నీరసం నుండి కాపాడుతుంది.

. తగిన విశ్రాంతి తీసుకోండి.వేడి అధికంగా ఉండే సమయంలో శరీరానికి విశ్రాంతి అవసరం సుమారు 1530 నిమిషాలు మద్యాహ్నం విశ్రాంతి తీసుకుంటే శరీరం చల్లబడి మళ్లీ శక్తిగా మారుతుంది. తల తిరుగుడు, నీరసం తగ్గుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది ఉపయుక్తం. ఎక్కువ శారీరక శ్రమ వద్దు వేడి కాలంలో హార్డ్ ఫిజికల్ వర్క్ చేయడం వల్ల శరీరం త్వరగా అలసిపోతుంది.

వేడి సమయంలో అధిక శ్రమ చేయకుండా ఉండాలి. పని విశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం.ఇంటి చుట్టూ చల్లదనం ఉంచండి

ఇంట్లో గాలివేడి తగ్గించేందుకు కర్టెన్లు వాడాలి. తడి గుడ్డలు తలుపులపై ఉంచితే చల్లదనం పెరుగుతుంది. నాన్నినట్టగా నేలతో పాటు గోడలు కూడా చల్లబెడతాయి. పెద్దవాళ్లకు ఇది మరింత అవసరం. రోజు రెండు సార్లు స్నానం చేయండిఒకసారి ఉదయం, ఒకసారి సాయంత్రం స్నానం చేస్తే శరీర వేడి తగ్గుతుంది. శరీరంలోని మురికి, చమట పోయి చల్లదనం వస్తుంది, వాసనతో పాటు ఒత్తిడినికూడా తగ్గిస్తుంది. తాజాదనాన్ని కలిగిస్తుంది.

**పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి**

వీరి శరీరం వేడి తట్టుకోలేరు. వాళ్ళను బయట పంపేటప్పుడు టోపి, నీరు, చల్లదనపు పదార్థాలు ఇవ్వాలి. రూములో వాతావరణం చల్లగా ఉండేలా చూడాలి. వేడి వల్ల వేగంగా డీహైడ్రేషన్ జరుగుతుంది. తాటి ముంజలు, బార్లీ బియ్యం నీళ్లు సహాజా శరీర చల్లదనాన్ని ఇస్తాయి. వీటిని తరచూ వాడడం వల్ల శరీరం వేడి తగ్గుతుంది, బయట నుంచి వచ్చిన వెంటనే చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. ఇది ఫ్రెష్ ఫీలవడానికి సహాయపడుతుంది.

కాఫీ, మద్యం తగ్గించండి. ఇవి డీహైడ్రేషన్ కు దారి తీస్తాయి. శరీరంలోని నీటి శాతం తగ్గించడంతో నీరసం, తలనొప్పి వస్తాయి. బదులుగా నిమ్మకాయ, బుట్టల బియ్యం నీళ్లు తాగాలి. ఇవి శరీరాన్ని చల్లబెడతాయి.

**హీట్ స్ట్రోక్ లక్షణాలు గమనించండి**

తల తిరగడం, అధిక ఒళ్ళు వేడి, విరేచనం, బలహీనత కనిపిస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించాలి.వెయిట్ లాస్, చర్మం ఎర్రగా మారడం కనిపిస్తే అలసత్వం వద్దు ఇది ప్రమాదకరమైన పరిస్థితి కావచ్చు. ఆరోగ్య సూచనలు పాటించడం తప్పనిసరి.ఎండాకాలం అనేది ఆరోగ్యపరంగా సవాలుతో కూడిన కాలం, సరైన జాగ్రత్తలు తీసుకుంటే మనం ఈ వేడి కాలాన్ని సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదుర్కోవచ్చు. తగిన ఆహారం, నీరు, విశ్రాంతి మరియు చల్లదనపూరిత జీవనశైలితో ఈ కాలాన్ని ఆనందంగా గడపవచ్చు. వృద్ధులు, పిల్లలు , గర్భిణీలు మరింత శ్రద్ధ వహించాలి.

కామిడి సతీష్ రెడ్డిములుగుపల్లి బయాలజీ టీచర్ భూపాల్ పల్లి జిల్లా
9848445134

## ఆ గాయాలు క్షమాపణలతో మానేవి కావు....!


"నేను విజయేంద్ర ప్రసాద్. నన్ను క్షమించండి.. క్షమించండి ..క్షమించండి" అంటూ వేడుకున్నారు. హైదరాబాద్ లో ఇటీవల జరిగిన ఓ సభలో సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ దళిత వర్గాలను ఉద్దేశించి మాట్లాడుతూ " మా తండ్రి, నేను ఎటువంటి తప్పులు చేయలేదు.. కానీ మా పూర్వీకులు నోటితో చెప్పలేని తప్పులు చేశారు. మా తాతలు, ముత్తాతలు అంటరానితనం పేరుతో భయంకరమైన దారుణాలు చేశారు" అని బాహాటంగా ఒప్పుకోవడం హర్షించదగ్గ విషయమే. ఆనాటి పరిస్థితులను తలుచుకున్నప్పుడు అవమానంతో కుంగిపోతున్నాని చెప్పారంటే ఈ దేశంలో దళిత, అణగారిన వర్గాలపై ఎంతటి అమానవీయ చర్యలు జరిగి ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. విజయేంద్ర ప్రసాద్ సినిమా ప్రపంచంలో ఓ సంచలన కథా రచయిత.

మగధీర, బాహుబలి, శ్రీకృష్ణ, రాజన్న లాంటి అనేక సినిమాలకు ఆయన కథలను అందించారు. ఆయన రాసిన కథల సినిమాలకు ఆయన స్క్రీన్ ప్లేగా వ్యవహరించిన సినిమాలు గొప్పగా ప్రేక్షకులకు అలరించడమే కాకుండా వాటికి గొప్ప అవార్డులు లభించాయి. నందిఅవార్డును సైతం అందుకున్నారు. అంతటి గొప్ప వ్యక్తి ఇప్పుడు ఒక్కసారిగా అంటరానితనంపై ఈ ఆధునిక కాలంలో మాట్లాడడం గొప్ప చర్చకు ఆయన నిబద్ధతకు అద్దం పట్టినట్లు కన్పిస్తుంది. ఈ సమాజంలో దళితుల పట్ల తీవ్రమైన వివక్ష ఉందనే సాక్ష్యాన్ని విజయేంద్ర ప్రసాద్ ఒప్పుకోవడం నిజంగా ఆయన నిబద్ధతను మెచ్చుకోవాలి. విజయేంద్ర ప్రసాద్ చెప్పిన మాటల్లో తమది అత్యంత సంపన్న కుటుంబమని, తనకు తెలిసి ఏ తప్పు చేయలేను కానీ తమ పూర్వీకులు మాత్రం నోటితో చెప్పలేని భయంకరమైన దారుణాలు చేశారని వారి తరుపున క్షమాపణలు అంటూ వేడుకున్నారు. కానీ ఈ విషయంలో క్షమించండి అనే పదం ఎప్పటికీ సరిపోదు. ఎందుకంటే ఈ దేశంలో దళిత, బడుగు, బలహీన వర్గాలను కేవలం తక్కువ కులమని దూరం పాటించడమే




కాకుండా వందల ఏళ్లు సమాజంలో అక్షరానికి, అవకాశాలకు దూరంగా ఉంచారు. అంటరానితనం పేరుతో ఎంతటి అవమానాలకు గురిచేశారో తెలియదు అటువంటి అంశాలను విజయేంద్ర ప్రసాద్ నిర్మొహమాటంగా చెప్పడంతో పాటు క్షమాణలు కోరారు. ఘోరాలు చేసిందో విజయేంద్ర ప్రసాద్ గొప్ప కథ రచయిత వాస్తవానికి ఆయన ఈ నిజాలను చెప్పకున్నా ఎవరూ ఆయనను ప్రశ్నించిన వారు ఉండరు. కానీ ఎందుకో ఆయన మనసులో గతపు గాయాలు.. మళ్లీ కలచివేసి ఆయన వినమ్రంగా క్షమాపణలు కోరేల చేసిందంటే అంటరానితనం పేరిట ఎన్ని ఘోరాలు జరిగి ఉంటాయి. ఇప్పటికీ ఈ దేశంలో అనేక ఘోరాలు దళితులపై జరుగుతున్నాయి. కులాంతర వివాహలు చేసుకున్నా ఇతర కారణాలతో ఆనాడు అంటరానితనం అయితే ఇప్పుడు అది రూపాంతరం చెంది అధికారంతో అణచివేతగా మారింది. అధికార బలాన్ని ఉపయోగించి దళితులను అణచివేస్తున్నారు. అయితే విజయేంద్ర ప్రసాద్ తన పూర్వీకుల అరాచకత్వాన్ని సమాజం ముందు ఉంచడంతో పాటు తాను మాత్రం అటువంటి చర్యలకు పాల్పడలేదనే సంగతిని గుర్తు చేశారు. అయితే వారి పూర్వీకుల తరుపున క్షమాపణలు కోరడం వరకు బాగానే ఉంది. కానీ అది ప్రస్తుత సమాజంలో ఇంకా రూపుమాపాల్సిన బాధ్యతను తీసుకోవాల్సిన అవసరం ఉంది. తన కార్యాలయంలో అంబేద్కర్ గారి ఫోటో మాత్రమే ఉంటుందని .. అంబేద్కర్ ఉద్యమంపై కథ రాస్తున్నాని చెబుతూ నీటి కోసం అంబేద్కర్ చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. సినీ చరిత్రలో దేశం గర్వించదగ్గ ప్రభావ వంతమైన సినిమా కథలు రాసే విజయేంద్ర ప్రసాద్ ఈ సమాజంలో అంటరానితనం పై సూటిగా స్పందించడం హర్షిందగ్గ విషయమే అయితే ఇది కేవలం క్షమాణల వరకే పరిమితం కాకుండా ప్రస్తుత, భవిష్యత్తు తరాలు మేల్కొనేలా గొప్ప చర్యలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. అలాగే విజయేంద్ర ప్రసాద్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఉన్న నేపథ్యంలో ఈ దేశంలో జరుగుతున్న దళితుల స్థితిగతులపై కూడా స్పందించాలి. బాబాసాహేబ్ అంబేద్కర్ చెప్పిన రాజ్యాధికారమే అన్నింటికీ పరిష్కారమనట్లు చెప్పాడని .. ఆ రాజ్యాధికారంలో అంటరాని వర్గాల ప్రాతినిధ్యం పెరిగేలా చూడాలి. సినీ రంగంలో కూడా అవకాశాలను కల్పించడం వల్ల ఆచరణాత్మకంగా అంటరానితనాన్ని రూపుమాపిన వారవుతారు. అంటరానితనం అనేది అన్ని రంగాలలో కన్పించకుండా బుసలు కొడుతూనే ఉంది. సినీ ఇండస్ట్రీస్ లో ఎంతో మహమహులమని భావించే వారు కనీసం సామాజికంగా ఇటువంటి విషయాలపై స్పందించడమూ తక్కువే.. అటువంటిది విజయేంద్ర ప్రసాద్ ఎన్నో గొప్ప చిత్రాలను అందించి..ఎన్నో ప్రతిష్టాత్మకమైన అవార్డులు పొంది ..గొప్ప పేరు ప్రఖ్యాతలు కలిగిన వ్యక్తి అంటరానితనం పై మాట్లాడిన మాటలు నిజాలకు సాక్ష్యం. కథలు ఎంత గొప్పగా రాసినా ... నిజాలను నిర్భయంగా ఒప్పుకొని క్షమాపణలు కోరిన మీ తీరు మానవత్వానికి అద్దం పడుతోంది. మీలాంటి స్ఫూర్తితో నేటీ ఆధునిక సినీ ట్రెండ్ లో కమర్షియల్ సినిమాలే కాకుండా ... వాస్తవ జీవితాలు, సామాజిక కోణంలో, ఈ దేశంలో గత చరిత్ర ను వెలికితేసే చిత్రాలు వస్తేనే భవిష్యత్తులో ఈ దేశం, మానవ సమాజం మరింత మానవీయ విలువలతో కూడిన సమాజంగా మారే అవకాశం ఉంటుంది. ఎంత పెద్ద విజయాలు ఇచ్చిన సినిమాలకు కథలు రాసి గొప్ప పేరు కలిగిన విజయేంద్ర ప్రసాద్ నిజ జీవితపు గతాన్ని కళ్ల ముందు ఉంచి మరోసారి బహుబలి లాంటి బలమైన నిజాన్ని సమాజం ముందు ఉంచడం గొప్ప విషయం. తాతల, పూర్వీకుల ఆస్తులను అనుభవిస్తున్న వ్యక్తిగా వారి తప్పులను మీ భుజాన వేసుకొని సమాజానికి కృతజ్ఞతగా మెలగడం మీ విలువలకు సాక్ష్యంగా నిలుస్తుంది. తరతరాల అణచివేతకు క్షమించడం అనే పదం సరిపోనిది అయినప్పటికీ మీరు ఆ పదం చెప్పడంలోనే అంటరాని వర్గాల ఆవేదనను ప్రస్తుత సమాజం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మీలాంటి గొప్ప వ్యక్తులు సమాజానికి ఇటువంటి విషయాన్ని స్వయంగా తెలియజేయడం హర్షించదగ్గ విషయం.


సంపత్ గడ్డం
కామారెడ్డి
7893303516



## సేవ్ బర్డ్స

- రైతు నేస్తనికి ముప్ప
- కనుమరుగవుతున్న పిచ్చుకలు
- సంరక్షణకు నడుంకట్టిన అనంతుల రమేష్






మార్చి 20 న ప్రపంచ పిచుకల దినోత్సవం వాతావరణ మార్పులు పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. తెలతెలవారుతుండగా ఒకప్పుడు పక్షుల కిలకిలరావాలు పల్లెసీమలను అలరించేవి. పొలాల్లో పురుగుప్రా తింటూ రైతుకు ఎంతో మేలు చేసేవి. శరవేగంగా మారుతున్న పట్టణీకరణ, సెల్‌టవర్ల తరంగాలు, పొలాల్లో విషపూరిత పురుగుమందుల వాడకం పక్షుల మనుగడకు ప్రతికూలంగా పరిణమించింది. పిచ్చుకలైతే దాదాపు అంతరించిపోతున్నాయి. ఈ తరుణంలో పిచ్చుకల సంరక్షణ కోసం నడుంకట్టాడు....కరీంనగర్ కిసాన్ నగర్ కు చెందిన అనంతుల రమేష్ . తన ఇంటి ఆవరణాన్ని పిచ్చుకలకు ఆవాసంగా మార్చారు.. పిచ్చుకల కోసం ఇంటి ఆవరణంలో కృత్రిమ గుళ్ళు, తినడానికి గింజలు, ఇంటి చుట్టు మట్టి చిప్పల్లో నీళ్లు ఇంటి చుట్టూ పచ్చని చెట్లు ఉండడంతో . వందలాది పిచ్చుకలు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన గూళ్ళ ఏర్పాటు చేసుకుని, గుడ్లు పెట్టి.. సంతానోత్పత్తి చేస్తున్నాయి. ఉదయం గుంపులు గుంపులుగా వచ్చే పక్షులు కిల కిల రావాలతో ఇంటిల్లి పాది నిద్ర లేస్తారు..అక్కడికి వచ్చే పక్షులను చూడడానికి స్కూలుకు వెళ్లి చిన్న పిల్లలు చుట్టుపక్కల వారు వచ్చి పక్షుల కిలకిల రావాలని చూస్తూ ఆనందిస్తారు..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 18.03.2026
www.mudranews.in | @mudranews



**మలబద్ధకం**



ప్రతిరోజూ ఒకే సమయానికి విసర్జన అలవాటు చేసుకోవాలిరోజూ ఒక నిర్దిష్ట సమయానికి టాయిలెట్‌కి వెళ్లడం వల్ల శరీరం సహజ రిథమ్‌కు అలవాటు పడుతుంది.

# వైద్య కళాశాల నూతన భవనంలో తరగతులు ప్రారంభించాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ముద్ర, వనపర్తి:**

ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవనంలో వెంటనే విద్యార్థులకు తరగతులను ప్రారంభించేందుకు కావలసిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ కొత్త భవనాన్ని సందర్శించి, భవనంలో కొనసాగుతున్న ఫినిషింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవనంలోని పలు విభాగాలను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారు లకు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే 10 రోజుల్లోనే మెడికల్ కాలేజీని కొత్త భవనంలోకి షిఫ్ట్ చేసి విద్యార్థులకు తరగతి గదులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. ప్రస్తుతంకళాశాల కొనసాగుతున్న భవనం నుంచి అవసరమైన పరికరాలను త్వరితగతిన కొత్త భవనానికి తరలించాలని సూచించారు. త్వరలోనే ఈ భవనానికి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.అనంతరం కలెక్టర్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేటాయించిన స్థలాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఆర్ అండ్ బి కార్యనిర్వాహక ఇంజనీర్ దేశ్య నాయక్, ఈ డబ్ల్యు ఐ డి సి కార్య నిర్వాహక ఇంజనీర్ రామచందర్, ఇతర అధికారులు



తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

**గ్యాస్ కొరత లేకుండా చూడాలి**

ప్రజలకు గ్యాస్ సిలిండర్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అవసరం ఉన్న ప్రతి వినియోగదారుడికి సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైస్ మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ బియ్యం రికవరీని క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, పౌరసరఫరాల డిఎం, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి**

రోడ్డు ప్రమాదాలు నివారించడానికి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు ఎస్పీ డి. సునీత రెడ్డి హాజరయ్యారు. జాతీయ రహదారి పై గుర్తించిన బ్లాక్ స్పాట్ ప్రాంతాలు వెల్టూర్ జంక్షన్, మదర్ థెరిసా జంక్షన్, పాలెం బ్రిడ్జి, పెబ్బేర్ బైపాస్ రోడ్డు, విలియంకొండ, రంగాపూర్ తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై ఇచ్చిన సూచనలు ఎంతవరకు పూర్తి చేశారని అధికారులను ప్రశ్నించారు. జిల్లా కమిటీ సూచనల మార్కు బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం, హైమాస్క్ లైట్లు, బ్లింకింగ్ లైట్లు, రంబుల్ స్ట్రిప్ ఏర్పాట్లు చేయడం జరిగిందని, విలియం కొండ వద్ద అనధికారిక యు టర్న్ ను మూసివేయడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. . రోడ్డు ప్రమాదాలు నివారించే క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న భద్రత పరమైన అంశాలపై మరింతగా దృష్టి సారించాలని ఆదేశించారు. మదనపూర్ వంతెన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన పలు చర్యలపై సూచనలు చేసారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎన్. ఖీమ్య నాయక్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బీ అధికారి దేశ్యా నాయక్, డి సీ ఆర్ బీ డిఎస్పీ బాలాజీ నాయక్, ఆర్టీవో మమత, ఎస్సైలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో మెరిసిన నిరంజనమ్మకు అభినందనలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



రాష్ట్రస్థాయి పరుగు పందెంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణి ఏ. నిరంజనమ్మను కలెక్టర్ అభినందించారు. ఈ నెల 15న హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన మూడవ రిలే కార్నివాల్ అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచిన ఆమెను ఆలేరు ఉప ఆరోగ్య కేంద్రంలో శాలువా కప్పి, బంగారు పతకం, ప్రశంస పత్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కీర్తి తీసుకువచ్చిన ఆమె అంకితభావాన్ని ప్రశంసించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. నర్సుగా పనిచేస్తూనే క్రీడల్లో రాణించడం ప్రేరణనిచ్చేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి నాయక్, డీఐఓ సురేష్ బాబు, డాక్టర్ నాగేశ్వరి, తెలకపల్లి సర్పంచ్ కొమ్ము శేఖర్ పాల్గొన్నారు.

## ముస్లింలకు బట్టలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ముద్ర కూకట్ పల్లి :**



రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కాజా నగర్ ఈద్గా, ఎన్టీఆర్ నగర్ మసీదుల వద్ద ముస్లింలకు బట్టల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్లతో కలిసి పేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ముద్ర, కూకట్‌పల్లి:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సామాన్యుల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక నేతలతో కలిసి ఆయన ఇంద్రానగర్ బస్తీలో పాదయాత్ర నిర్వహించి, స్థానికుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ లైన్లు, తాగునీరు, దెబ్బతిన్న రహదారులు ప్రధాన సమస్యలుగా ఉన్నాయన్నారు. స్పందించిన ఆయన అనుమతులు ఉన్న పనులను ఆపకూడదని అధికారులను ఆదేశించారు. ఐడీపీఎల్ భూముల కబ్జాపై ప్రభుత్వం ఇప్పటికే విచారణ చేపట్టిందని, నివేదిక రాగానే ఎంతటి వారైనా, ఏ పార్టీ వారైనా విడిచిపెట్టే ప్రసక్తే లేదు. పాదయాత్రలో మధు గౌడ్, సోను, పులి శివ గౌడ్, మధు, నరేందర్, తిరుపతయ్య, సత్యం, శంకర్ గౌడ్, ఏ రాజు, బి రాజు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలకు ప్యూర్ వాటర్ ఫిల్టర్




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

తాడూర్ మండలం భల్లాన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మున్సిపల్ సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.35,000 విలువైన ప్యూర్ ఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తాను ఈ గ్రామంలోనే చదువుకున్నానని, చిన్నప్పటి జ్ఞాపకాలను మరువకుండా సొంత ఊరి అభివృద్ధికి తన వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. భల్లాన్‌పల్లి గ్రామం నుంచి చదువుకొని రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదగడం అరుదైన విషయం అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, భవిష్యత్తులో కూడా స్కూల్ అభివృద్ధికి తన సహకారం కొనసాగిస్తానని తెలిపారు.

# పెద్ద చెరువు సుందరీకరణ పనుల డిజైన్ పూర్తి

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ముద్ర, కాప్రా:**

ఉప్పల్ నియోజకవర్గంలోని హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, పనుల డిజైనింగ్ ప్రక్రియ పూర్తయిందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ సుందరీకరణ పనులకు సంబంధించి చెరువును ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై ఎమ్మెల్యే, డిజైనింగ్ పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ ఏజెన్సీ ప్రతినిధి యూసుఫ్, శ్రీనాథ్ తో కలిసి చెరువును పరిశీలించారు. చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి ఉండడం వల్ల నాచారం ప్రాంత ప్రజలు దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చెరువు లోని నీటిని ఖాళీ చేసి చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన ఏజెన్సీ బాధ్యులు చెరువులోని నీటిని తొలగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత 30–40 సంవత్సరాలుగా ఈ చెరువును ఏ



ప్రజాప్రతినిధి పట్టించుకోలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో చెరువు అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల హెచ్‌ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బారాసా రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## క్రీడల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలి

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**



మన జిల్లా క్రీడాకారులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో సైతం రాణించి, జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఇటీవల జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో జూడోలో 66 కేజీల విభాగంలో జిల్లా క్రీడాకారుడు బంగారు పతకం, 46 కేజీల విభాగంలో జిల్లా క్రీడాకారిని రజత పతకం సాధించడమే కాక జిల్లా మహిళల కబడ్డీ జట్టు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో, పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలవడంతో మంగళవారం కలెక్టరేట్లో క్రీడాకారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డివైఎస్ఓ క్రిష్ణయ్య, ఎస్జిఎఫ్ సెక్రెటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిర్మూలన కోసం అందరూ కృషిచేయాలి

**- పొల్యూషన్ కంట్రోల్ అధికారి సాజీన**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్ తెలిపారు."మన తెలంగాణ – పరిశుభ్ర తెలంగాణ" అనే నినాదంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ మరియు కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పొల్యూషన్




కంట్రోల్ బోర్డ్ అధికారి సాజీనా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ కారణంగా జరిగే నష్టాలను కూలంకషంగా వివరించారు.పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి సాజీనా మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ పెను సమస్యగా మారిందని, దాని నియంత్రణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇతరులను కూడా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వనిత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఉమాదేవి, కోదండరాములు, రామకృష్ణ, ముజఫర్, దశరథం, శోభారాణి పాల్గొన్నారు.

## విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసిన ఎమ్మెల్యే

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



తాడూరు మండలం పర్వతాయపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని సాంబ కవితకు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఇబ్రహీంపట్నం లోని శ్రీ దత్త గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బి.టెక్ 3వ సంవత్సరం చదువుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అత్యంత కీలకమని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మెరుగుపరుచు కోవాలని సూచించారు. అలాగే కుటుంబానికి, సమాజానికి, నియోజక వర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

## తుంగతుర్తి ఎమ్మెల్యేపై చర్యతీసుకోవాలి




**ముద్ర, కాప్రా:**

భారత జాతి, హిందూ ధర్మంపై అవమానకర వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మందుల శ్యాముల్‌పై క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిందూ మంత్రాలు, పూజారులపై అవమానకర వ్యాఖ్యలు చేసి మతపరమైన భావాలను కించపరిచారని, బిజెపి రాష్ట్ర నాయకురాలు పులుగు గిరుకబావి సురేఖ ఆరోపించారు క్షమాపణ చెప్పకుంటే తెలంగాణలో ఎక్కడ తిరగనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ సిఐ భాస్కర్ రెడ్డి ని కోరారు. బిజెపి నాయకులు నిత్యానందు ,హేమంత్, మంజునాథ్, మహేష్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

**- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

వచ్చేనెల 20వ తేదీ నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదవత్ సంతోష్, అధికారులకు ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. తెలకపల్లి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించి, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పనులను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుము వంటి సామగ్రి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా పనులు నిలిచిపోకుండా చూడాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ గృహ నిర్మాణ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం అందరి బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. దశలవారీగా పూర్తైన



నిర్మాణాలకు సంబంధించి బిల్లులు వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ల

**పీహెచ్‌సీ తనిఖీ**

తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అన్న విషయాన్ని తెలుసుకునేందుకు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారు ఏ సమస్యతో వచ్చారో, డాక్టర్లు ఎలా వైద్యం అందిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. తతతఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## రెండు దశల్లో జనగణన

**- కలెక్టర్ ఖుష్బు గుప్తా**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించనున్నామని కలెక్టర్ ఖుష్బు గుప్తా వెల్లడించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జన గణనలో పాల్గొనే అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్,హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన, మే 11 న ప్రారంభమై జూన్ 9 వరకు కొన సాగుతుందన్నారు. రెండవ దశలో జన గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ 2027 ఫిబ్రవరిలో నిర్వహించబడుతుందని, మార్చి ఒకటి నాటికి రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ కార్యాలయం ఏ.డి.రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సీపీవో రవీందర్, జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డిపిఓ వెంకట రెడ్డి, డీఈవో ప్రవీణ్ కుమార్, జిల్లా మాస్టర్ ట్రైనర్ బాలు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి 15 శాతం కేటాయించాలి

**ముద్ర, కూకట్‌పల్లి :**

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో విద్యాశాఖకు కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. మంగళవారం జేఎన్టీయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద భారీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ విద్యా రంగం అభివృద్ధికి తగిన నిధులు కేటాయించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ నగేష్, స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్ పూజిత్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబెర్ రిషి, స్టేట్ యూనివర్సిటీస్ కో–కన్వీనర్ దుర్గా ప్రసాద్, జశ్వంత్, యశ్వంత్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో ఆధ్వర్యంలో ఇఫ్తార్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లా కేంద్రంలో టీఎన్జీవో ఆధ్వర్యంలో ఇఫ్తార్ నిర్వహించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భావాండ్ల వెంకటేష్, జిల్లా కార్యదర్శి షర్ఫుద్దీన్ నేతృత్వంలో మంగళవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కోశాధికారి బాలరాజు, కమిటీ సభ్యులు కొ్ట్ర బాలాజీ, చెన్నకేశవులు, పి. కళ్యాణ్ కృష్ణారావు, జె.కె. వెంకటేష్, శ్రావణ్, కరిముల్లా, రహీం అహ్మద్ పాల్గొన్నారు.

## ఉచిత మజ్జిగ పంపిణీ

**ముద్ర కూకట్‌పల్లి:**

కేపీహెచ్‌బీ కాలనీలోని జేఎన్‌టీయూ రోడ్డులో ఉన్న పోచమ్మ తల్లి దేవాలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో బాటసారులకు, భక్తులకు అపరిమిత ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బీఎస్‌ఎన్ రాజు, వుచ్చా రాంబాబు, నూతి రాంబాబు నాయుడు, తుంగల శ్రీను, అనిల్ పాల్గొన్నారు.

**మలబద్ధకం : వ్యాయామం తప్పనిసరి**

నడక, యోగా వంటి తేలికపాటి వ్యాయామాలు పేగుల పనితీరును చురుకుగా ఉంచుతాయి.



# పుకార్లు నమ్మొద్దు..

- గ్యాస్ సిలిండర్ ల కొరత లేదు
- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

జిల్లాలో గృహ, వాణిజ్య గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. అన్ని గ్యాస్ ఏజెన్సీలలో తగినంత గ్యాస్ అందుబాటులో ఉందని తెలిపారు. గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్నవారికి నిర్ణీత సమయంలో పల సిలిండర్లను ప్రజలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఎవరికైనా గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బందులు కలిగితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 91005 77132 ను సంప్రదించవచ్చునని వివరించారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ల ఏజెన్సీ లతో సమావేశం నిర్వహించి, ప్రజలకు సరిపడినన్ని సిలిండర్లను సాఫీగా పంపిణీ చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు గ్యాస్ కొరత అని వస్తున్న అసత్య వార్తలను, పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

**సారంగాపూర్ లో స్టాక్ తనిఖీ**

గ్యాస్ సిలిండర్ల సరఫరా, భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించేందుకు ఎస్పీ జానకి షర్మిలతో కలిసి మంగళవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని గ్యాస్ సిలిండర్ గోదాంను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ సరఫరాలో జరుగుతున్న జాప్యం, గోదాం నిర్వహణలో భద్రతా ప్రమాణాల లోపాలపై ఆమె ఏజెన్సీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సిలిండర్లను పక్కదారి పట్టించడం, కృత్రిమ కొరత సృష్టించడం, బ్లాక్‌లో విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, తహసీల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

**ముద్ర, వేములవాడ:**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వర ఆలయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి వేములవాడ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు స్వామి వారి తీర్థం ప్రసాదాలు అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**ముద్ర, కరీంనగర్:**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ ఫంక్షన్ ప్యాలెస్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు చేసేటువంటి కఠినమైన ఉపవాస దీక్ష చాలా సత్ఫలితాలు ఇవ్వడమే కాకుండా వారి జీవితంలో విజయాలు అందిస్తుందని చెప్పారు. "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విఎన్ఆర్ ఫౌండేషన్ ఆరంభం నాటి నుండి ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని, ప్రవక్త ఆశీస్సులు ప్రతి ఒక్కరి మీద ఉండాలని, సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ కుమార్, పలువురు ముస్లిం మత పెద్దలు, మైనార్టీ కార్పోరేటర్లు పాల్గొన్నారు.



# రైతు సమస్యల పరిష్కారంలో విఫలం

- కల్వల ప్రాజెక్ట్ మరమ్మతుల విషయంలో ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లేదు
- తెలంగాణ జాగృతి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

**ముద్ర, కరీంనగర్:**





కరీంనగర్ జిల్లాలో మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాలలో రైతులకు ఉపయోగపడే కల్వల ప్రాజెక్టు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనీస మరమ్మతులు చేయక పోవడాన్ని నిరసిస్తూ మంగళవారం తెలంగాణ జాగృతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా ఇరిగేషన్ కార్యాలయం ధర్నా ముట్టడించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేసి జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ.. కల్వల ప్రాజెక్ట్ మత్తడికి మరమ్మతులు చేయాలని ఈ ప్రభుత్వానికి రైతులన్నా, వ్యవసాయం అన్న ఇష్టం లేదని మొదటి నుండి కూడా ఈ ప్రభుత్వానిది రైతు వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తూ రైతులను గాలికి వదిలేసిన సంఘటనలు మనం అనేకం చూస్తున్నాం. దానిలో భాగమే రెండు మనకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల మధ్యలో రైతులకు సాగునీటి కోసం ఉపయోగకరంగా ఉన్న కల్వల ప్రాజెక్ట్ మత్తడి కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు కావస్తున్న నేటికీ దానికి మరమ్మతులు చేయక తాత్సారం చేస్తూ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకుండా రైతులను నోళ్ళల్లో మట్టి కొడుతుంది. గతంలో ఈ మండలాలకు చెందిన రైతుల, ప్రజల విజ్ఞప్తి మేరకు జనం బాట కార్యక్రమంలో భాగంగా జాగృతి అధ్యక్షురాలు కవిత ఈ కల్వల ప్రాజెక్టును సందర్శించి మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఈ అసెంబ్లీ సమావేశంలోనే ఈ ప్రాజెక్ట్ నిధులు తీసుకుని వచ్చి మరమ్మతులు చేయించాలని వారు అన్నారు.కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల జాగృతి నాయకులు బుడిగె పర్శారం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, అదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, వారాల శ్రీనివాస్, గాలిపల్లి రత్నాకర్ చారి, బసవేణి రాజేందర్, గాడిచర్ల కొమరయ్య, ఉల్లేందుల నరేష్, అలిశెట్టి అజేయ్, గర్శకుర్తి విద్యాసాగర్, గుంజపడుగు పవన్ కుమార్, పుసాల పవన్, మహిళ నాయకురాలు యం డి సల్మ, బశెట్టి కృష్ణవేణి, జంగ అపర్ణ, పుల్లరి అంజలి, రోజా రెడ్డి, పోన్నం శిరీష, ఐలా ప్రసన్న, హరిష్, ఓర్గల శేఖర్, మేస మహేష్, తదితరులు ఉన్నారు.

# సమస్యలు తీరేదాకా పోరాటం

- జాతీయ రహదారిపై బైఠాయించిన ఆశ కార్యకర్తలు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



తమ డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ ఆశ కార్యకర్తలు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. సోమవారం రాత్రి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిద్రించి నిరసన వ్యక్తం చేశారు. మంగళ వారం జాతీయ రహదారిపై గంటకు పైగా బైఠాయించారు. సిఐటియు ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన 48 గంటల ధర్నాలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేస్తామని, పని భద్రత కల్పిస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చి మ్యానిఫెస్టోలో పెట్టిన తర్వాత కూడా ప్రభుత్వం ఈ హామీలను మర్చిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశాలకు మద్దతుగా అంగన్‌వాడీ యూనియన్ తమ సంఘీభావాన్ని ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శైలజ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి. సుజాత కార్యదర్శులు గంగా మణి, ఉపాధ్యక్షులు విజయ, చంద్రకళ, ఇంద్రమ్మ, నంద, సుగుణ, పద్మ, సహాయ కార్యదర్శులు కమల, రామలక్ష్మి, మంగ, శ్యామల, సులోచన, అనసూర్య జ్యోతి, వినోద పాల్గొన్నారు.



# అసైన్డ్ భూముల్లో వ్యాపారాలు చేస్తే పట్టాల రద్దు

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ తానూర్ మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులు తమకు కేటాయించిన ప్రభుత్వ అసైన్డ్ భూములను సాగు చేయకుండా వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. కొందరు మొరం వ్యాపారం సాగిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తులను గుర్తించి వారి పేరిట ఉన్న పట్టాలను తక్షణమే రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను అర్హులైన పేదలు సాగు నిమిత్తం మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఇతరులకు విక్రయించడం, వాణిజ్య అవసరాలకు మళ్లించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే వారి పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వానికి తిరిగి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

# గ్యాస్ సరఫరాలో పారదర్శకతకు ప్రాధాన్యం

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**ముద్ర, మహాదేవపూర్:**



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా పారదర్శకంగా, నిరంతరంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం భూపాలపల్లిలోని హెచ్‌పీ గ్యాస్, సింగరేణి కాలరీస్‌కు చెందిన గ్యాస్ ఏజెన్సీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వినియోగదారులకు సమయానికి గ్యాస్ సరఫరా అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎల్పీజీ డీలర్లు వినియోగదారుల బుకింగ్ సీక్వెన్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ గ్యాస్ రీఫిల్స్‌ను సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమాన్ని అతిక్రమించకూడదని ఆదేశించారు. జిల్లాలో గ్యాస్ కొరత ఎక్కడా లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- కత్తెర మల్ల అరుణ్ కిరణ్

**ముద్ర, కరీంనగర్:**

డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలోని అంబేద్కర్ స్టేడియంలో మంగళవారం డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేసి ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, శివ కుమార్, అరవింద్, ప్రకాష్, నితిన్, కిట్టు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.






# విద్యార్థుల క్షేత్ర పర్యటన

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కొండాపూర్ గ్రామ పంచాయతీని తమ క్షేత్ర పర్యటన లో భాగంగా సందర్శించారు. ప్రభుత్వ పాలనా శాస్త్రం, రాజనీతి శాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులకు ప్రత్యక్ష పరిశీలనానుభవం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యమని డాక్టర్ యు గంగాధర్ తెలిపారు. గ్రామ పంచాయతీ నిర్మాణం, అధికారాలు, విధులు, సమావేశాలు, ఆర్థిక వనరుల గురించి ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. గ్రామంలో చేపట్టే ఎలాంటి అభివృద్ధి కార్యక్రమానికైనా గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం అత్యంత ముఖ్యమని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్ర గొల్ల ముత్తవ్వ భాస్కర్, ఉపసర్పంచ్ పటేరి పోతన్న, పంచాయితీ కార్యదర్శి నితీష్ కుమార్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు రవీందర్ పాల్గొన్నారు.

# దళిత బంధు అమలు చేయాలి

- దళిత సంఘాల జేఏసీ డిమాండ్

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండల కేంద్రంలో మంగళవారం దళిత సంఘాల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ బత్తుల చంద్రమౌళి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేసి, దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపెల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ఈ విషయంలో స్పందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కర్ర ప్రభాకర్, తగరపు స్వామి కూడా పాల్గొన్నారు.



మలబద్ధకం
వేడి నీరు లేదా గోరువెచ్చని పానీయాలు
ఉదయం గోరువెచ్చని నీరు లేదా నిమ్మరసం తీసుకోవడం మల విసర్జనకు సహాయపడుతుంది.



# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

## - తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నిరసన




**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం అమలుకు నోచుకోలేని పథకాలు ఇస్తామని చెప్పి నెరవేర్చడంలో విఫలం చెందిందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం భువనగిరి పట్టణ, మండల అధ్యక్షుడు రత్నపురం బలరాం, చిరిక సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, డబుల్ బెడ్ రూములు, నిరుద్యోగ భృతి, చేయూత వితంతు,వృద్ధాప్య, వికలాంగుల పింఛన్ రైతు భరోసా, యువతకు జాబ్ క్యాలెండరు, మహిళలకు రూ.2500, దళితులకు మూడు ఎకరాల పొలం హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర పప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, సూర్వి శ్రీనివాస్ గౌడ్, పాదారాజు ఉమా శంకర్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోళ్ల బిక్షపతి, మేడి కోటేష్, పంచద్దుల బలరాం, వంగేటి విజయభాస్కర్, సురేష్ గౌడ్, పట్టణ కౌన్సిలర్ యాస్మిన్ నాగేష్,పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుత భాస్కర్, జనగాం కవిత, యంజాల మల్లిక, పట్టణ ఉపాధ్యక్షుడు యట వెంకటేష్, కొల్లోజు సతీష్, తాడూరి బాల శంకర్, ఉప సర్పంచ్ వెంకటేష్ నాయక్, జిల్లా కార్యాలయ కార్యదర్శి మంగు నర్సింహా రావు, రత్నపురం శ్రీశైలం, తాడూరి రాజు, నానాంచర్ల శివ, కారుపాటి రాజు, రాజు చారి, బండారు లోకేష్, గాయపాక పృధ్వి, వెంకటేష్, సైదులు పాల్గొన్నారు.




## ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి: సీపీఎం

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్ లో సీపీఎం భువనగిరి మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నర్సింహ హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక వాగ్దానాలు ప్రకటించి అమలు మాత్రం చేయడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, కొండమడుగు నాగమణి, మండల కమిటీ సభ్యులు మోట ఎల్లయ్య, కొండపురం యాదగిరి, మధ్యపురం బాల్ నర్సింహ, జిట్ట అంజిరెడ్డి పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య నిపుణలచే ప్రతి పిహెచ్ సిలలో మెడికల్ క్యాంప్ లు నిర్వహించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. మంగళవారం మేళ్లచెరువు పి హెచ్ సిలో జరుగుతున్న మెడికల్ క్యాంప్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ క్యాంపుల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మహిళలకు గర్భాశయ ముఖ కాన్సర్ లను గుర్తించే టాప్ స్పెయర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తారని తెలిపారు. మేళ్లచెరువులో నిర్వహించిన మెడికల్ క్యాంప్ లో 300 ఓపి నమోదు అయిందని తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న తీరు పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

### ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సీయల్ స్కూల్ తనిఖీ

మేళ్లచెరువు మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ లో కలెక్టర్ హాస్టల్ గదులను పరిశీలించిన అనంతరం వంట గదిని కూడా పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ప్రతి రోజు వంట బాగుంటుందా..? మెను ప్రకారం ప్రతిరోజు ఆహారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్ట్ లో కనీసం 70 శాతానికి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొనిరావాలని కోరారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ మాధవ్ కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యులు యశ్వంత్, మణి, ప్రజ్ఞ, సాయి శ్రీ , వెంకటేష్ , సమీర, మెడికల్ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఇన్చార్జి తహశీల్దార్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి, ఉప సర్పంచ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

హుజుర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌసింగ్ కాలనీని కలెక్టర్ పరిశీలించారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటే స్థలాన్ని, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, జిల్లా ఉద్యానవన అధికారి నాగయ్య, మిషన్ భగీరథ అధికారి కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తహసీల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం.

**ముద్ర, మోత్కూర్:**



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటిపై బిజెపి శ్రేణుల దాడికి నిరసనగా మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగొని రామచంద్రు గౌడ్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఫైళ్ళ సోమిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహా రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గానగని శైలజ నర్సింహా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పెలపూడి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, మెంట నగేష్, కుర్మిళ్ళ రాములు, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సుంకిశాల అనిల్, యాదయ్య, భగవంత్, గుండు శ్రీను, పల్లపు సమ్మయ్య, ఎడ్ల శ్రీను, సోషల్ మీడియా కన్వీనర్ పాలోజు శేఖరా చారి, మున్నీరు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని అర్చక సంఘం ధర్నా

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ వ్యాఖ్యలకు నిరసనగా యాదాద్రి భువనగిరి జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో భువనగిరి వినాయక చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జోషి పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ శాసనసభ్యులుగా ఎన్నుకోబడిన వారికి అన్ని కులాలను అన్ని మతాలను గౌరవించాల్సిన బాధ్యత వారిపైన ఉందన్నారు. మాటలను వెనక్కి తీసుకున్నట్లయితే రేపు జరగబోయే ఉగాది పంచాంగ శ్రవణ వేడుకలను బహిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రత్నాపురం బలరాం, నాయకులు పడమటి జగన్మోహన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మేరీ మాత విగ్రహాన్ని తొలగించిన నిందితులను అరెస్టు చేయాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



భువనగిరి మండల పరిధిలోని జమ్మాపురం లోని జాతీయ రహదారి పక్కన ఉన్న మేరీమాత విగ్రహాన్ని తొలగించి, కింద పడేసి అవమానపరిచిన నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, సిపిఎం మండల కార్యదర్శి, చీమల కొండూరు గ్రామ సర్పంచ్ పల్లెర్ల అంజయ్య, జమ్మాపురం గ్రామం సర్పంచ్ చిన్నబత్తిని లూర్దయ్య, తోగడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నబత్తిని బాలరాజు, సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, కొండమడుగు నాగమణి, గ్రామ ఉప సర్పంచ్ విజయరాణి, ప్రజలు సరూప రాణి, సునీత, సుందరి, మరియమ్మ, జోసెఫ్, అంతోని, జార్జి, చిన్నయ్య, ప్రసాద్, సిస్టర్ జోసెఫ్ పాల్గొన్నారు.

## 'మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు'

**ముద్ర, తుంగతుర్తి:**

మతసామరస్యాన్ని పంచుకోవడమే ఇఫ్తార్ విందు ముఖ్య ఉద్దేశమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ అన్నారు, మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ముస్లింలకు నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కంట్లమయ్య ఆర్ఐ మణికుమార్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, తిరుమల ప్రగడ కిషన్ రావు, ప్రవీణ్ రెడ్డి, ఉప్పుల రాంబాబు, కొండరాజు, పరశురాములు, మజీద్ నూర్ కమిటీ అధ్యక్షులు ఎండి జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టు

**ముద్ర, మోత్కూర్:**

గ్రామ పంచాయతీ కార్మికులకు ఈ ఏప్రిల్ నుంచి గ్రామపంచాయతీ నిధుల ద్వారానే వేతనాలు చెల్లించాలని ఆర్డర్ కు నిరసనగా మంగళవారం హైదరాబాద్ లో నిర్వహించే కార్యక్రమానికి వెళ్లకుండా మోత్కూర్ పోలీసులు గ్రామపంచాయతీ సిబ్బందిని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పని చేస్తున్నటువంటి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలని కోరారు. మండల అధ్యక్షుడు సూరారం నాగయ్య, గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ వైస్ చైర్మన్ సూరారం భాస్కర్, గ్రామపంచాయతీ సిబ్బంది పోట్టెపాక సైదులు, సూరారం బుచ్చయ్య, లతీఫ్, మల్లేష్, సుదర్శన్, వెంకన్న తదితరులు ఉన్నారు.

## మాట నిలుపుకున్న మున్సిపాలిటీ చైర్మన్

**ముద్ర, మోత్కూర్:**

మోత్కూర్ మున్సిపాలిటీ 6వ వార్డ్ అరేగూడెం లో రోడ్డు విస్తరణ చేస్తానని హామీ ఇచ్చి గెలవగానే నిలబెట్టుకున్నారు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అభివృద్ధిలో తోడ్పడి సహకరిస్తే మోత్కూరు మున్సిపాలిటీ ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బద్దం నాగార్జున రెడ్డి, వార్డు ఆఫీసర్ శ్రవణ్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## సబ్ ప్లాన్ నిధుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**




రాష్ట్రంలో దళితుల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం దళిత హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా సమితి సమావేశం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో కాశపాక దయాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం దళితులు, ఆదివాసుల కోసం కేటాయిస్తున్న నిధులను వారికి ఖర్చు చేయకుండా నిల్వ చేయడం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ దళితులు ఇంకా విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యం లో సబ్ ప్లాన్ నిధులు వారికి అత్యంత అవసరమని చెప్పారు. ఈ సమావేశంలో డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి సలిగంజి వీరాస్వామి, జిల్లా నాయకులు ఇంజ హేమలత, భాగ్య, కొమ్ము బాల నర్సింహా, లింగస్వామి, మూల పోచయ్య , చెడె సుందర్, శాంతి కుమార్, రమేష్, స్వామి, మనోహరమ్మా పాల్గొన్నారు.

## కోదాడ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ



**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నందు నిర్వహిస్తున్న రికార్డ్స్, ఫిర్యాదుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, కమ్యూనిటీ కార్యక్రమాలు, సీసీ కెమెరాల నిర్వహణ ను పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులను, పెండింగ్ ఫైల్స్ పరిశీలించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై వేగంగా స్పందించి వారికి భరోసా కల్పించాలని కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు వేగంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు భద్రత పట్ల, సైబర్ మోసాల పట్ల, సామాజిక భద్రత పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలు ఒకరికొకరు సోదరభావంతో ఉంటూ కుల , మతాలకతీతంగా ఉత్సవాలను కలిసి మెలిసి జరుపుకోవాలని కోరారు. ప్రజల భద్రతలో పోలీస్ శాఖ అనునిత్యం కృషి చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, కోదాడ పట్టణ ఇన్సపెక్టర్ శివ శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇనస్పెక్టర్ రామారావు , ఎస్ఐ లు సుదీర్ , చిన్న మాల్సూర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజి రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

రాష్ట్ర బడ్జెట్లో ఆశ వర్కర్లకు బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశాలను వేతనం అందజేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, అంగన్వాడీ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముక్కెర్ల వెంకటమ్మ, కస గోని లలిత, నాయకులు జ్యోతి సంతోష, సుజాత, జమున, అరుణ, ధనలక్ష్మి, సైదమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### - కలెక్టర్ అనురాగ్ జయంతి



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

జిల్లాలో డ్రగ్స్ మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. మంగళవారం మినీ మీటింగ్ హాలులో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా విద్యా,తదితర సంబంధిత విభాగాలతో కలిసి డ్రగ్స్ నిర్మూలనపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, జిల్లా విద్యా శాఖ అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మోత్కూర్ గ్రంథాలయ చైర్మన్ గా కోమటి మత్స్యగిరి

**ముద్ర, మోత్కూర్:**

మోత్కూర్ శాఖా గ్రంథాలయ చైర్మన్ గా కోమటి మత్స్యగిరి ని నియమిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎండీ అవైస్ ఉర్ రెహమాన్ చిస్తీ జారీ చేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం హైదరాబాద్ లోని తన నివాసం లో అందజేశారు. ఈ సందర్భంగా కోమటి మత్స్యగిరి కి శుభాకాంక్షలు తెలియజేసి మోత్కూర్ శాఖా గ్రంథాలయ అభివృద్ధి కి సహాయ సహకారాలు అందిస్తానని ఆన్నారు. ఈ సందర్భంగా కోమటి మత్స్యగిరి ఎమ్మెల్యే మందుల సామెలుకు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిస్తీ కి కృతజ్ఞతలు తెలియజేశారు.



**మలబద్ధకం : మందులపై జాగ్రత్త**



రక్తపోటు, మధుమేహం మందులు మలబద్ధకానికి కారణమైతే వైద్యుడిని సంప్రదించి మార్పులు చేసుకోవాలి.



# ఆయిల్ ఫామ్ పంటతో అధిక లాభాలు

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

సాంప్రదాయ పంటల కంటే ఆయిల్ ఫామ్ పంటతోనే రైతులకు అధిక లాభాలు ఉంటాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలంలోని గాంధారిపల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ పంటను పరిశీలించారు. రైతులతో ముచ్చటించి, వాణిజ్య పంటలపై వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆయిల్ ఫామ్ సాగు విధానం, దిగుబడి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ ఆయిల్ ఫామ్ పంటను సమర్థవంతంగా సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీలలో సిద్దిపేట జిల్లాలోని ఆయిల్ ఫామ్ పంటల పరిశీలన కోసం 70 బస్సులు ఏర్పాటు చేసి మెదక్ జిల్లా రైతులను పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు..

ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పాపన్నపేట మండల కేంద్రంలోని పీహెచ్సీలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్వో హరిప్రసాద్, మెడికల్ ఆఫీసర్ అన్వర్, సీహెచ్‌వో చందర్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ హెల్త్ కార్డుల అమలుకు యాక్షన్ ప్లాన్

- కలెక్టర్ ప్రావీణ్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న డిజిటల్ హెల్త్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడానికి సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, జిల్లా వైద్య అధికారులతో డిజిటల్ హెల్త్ కార్డు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేసే అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన ఆరోగ్య సేవలు అందించడంలో డిజిటల్ హెల్త్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి హెల్త్ ఐడి నమోదు జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రాజెక్ట్ అమలుపై అవగాహన కల్పించడం, అవసరమైన సిబ్బంది, పరికరాలు సమకూర్చడం, ప్రాథమిక నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం. వసంతరావు, వైద్యాధికారులు డాక్టర్ శశాంక్, డాక్టర్ నాగ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**



ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని బస్తీ దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, శెట్కార్ గ్రౌండ్స్, ప్రభుత్వ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఓపీకి వచ్చే రోగుల వివరాలపై ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారా అన్న విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ గదిలో మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం నారాయణఖేడ్‌లోని శెట్కార్ గ్రౌండ్స్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ఉమా హారతి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్ నాయక్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికల రూపకల్పనలో జనగణన కీలకం

- అదనపు కలెక్టర్ నగేష్



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రణాళికల రూపకల్పనలో జనగణన కీలకమని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో చార్జ్ అధికారులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నిర్వహిస్తున్న తొలి జనగణన ఇదేనని, 2011 జనాభా గణన తర్వాత 2021లో నిర్వహించాల్సిన ఈ ప్రక్రియ కోవిడ్ కారణంగా 2027లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని చెప్పారు. రెండవ దశలో జనగణన (పాపులేషన్ ఎన్యూమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో జరుగుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని తెలిపారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెవెన్యూ గ్రామాలు, పట్టణాల్లోని వార్డులను సి.ఎం.ఎం.ఎస్ పోర్టల్ ద్వారా హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ నిర్వహణపై శిక్షణలో వివరించారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు రూ. 18వేల వేతనం నిర్ణయించాలి

- లేదంటే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లాలో ఆశా వర్కర్ల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. బడ్జెట్ సమావేశాల్లోనే ఆశా వర్కర్లకు రూ. 18 వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, లేకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి హెచ్చరించారు. మంగళవారం ఆశా వర్కర్లు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టి, అనంతరం ర్యాలీగా కలెక్టరేట్ ప్రధాన గేట్లను తోసుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని, అధికారులతో చర్చలు జరిపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు కొంతమేర వెనక్కి తగ్గారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బయటకు వచ్చి సిఐటియు నాయకులతో చర్చలు జరిపారు. ఆశా నాయకులతో కలిసి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ బడ్జెట్ సమావేశంలోనే రూ. 18 వేల ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతోపాటు ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్లు కల్పించాలని కోరారు.. జనాభా ప్రాతిపదికన ఆశా వర్కర్ల నియామకాలు ఉన్నప్పటికీ, పట్టణాలు, మండల కేంద్రాల్లో ఒక్కో వర్కర్‌పై అధిక జనాభా బాధ్యత పడుతోందని, దీనివల్ల పని భారం పెరుగుతోందన్నారు. ఈ ధర్నాకు సంఘీభావం తెలుపుతూ సీపీఎం సిద్దిపేట జిల్లా కార్మిక నాయకులు రాళ్లబండి శశిధర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భూలక్ష్మి, కార్యదర్శి ప్రవీణ, కోశాధికారి భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు బాలమణి, భాగ్యశ్రీలత, అంజలి, రమ, కమల, లక్ష్మి, వాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



### కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

అసెంబ్లీ సమావేశాల్లో ఆశావర్కర్లకు రూ. 18 వేల వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈసందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీరంతా మహిళలే కాగా, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని చెప్పారు. ఇప్పటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కనీసం గ్యారెంటీ ఫిక్స్‌డ్ వేతనం కూడా ఇప్పటి వరకు నిర్ణయించలేదని విమర్శించారుఈ సమస్యలన్నింటిని పరిష్కరించేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు పెంచాలని ఆశా వర్కర్లు కోరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నాయకులు రాణి, దేవమ్మ, నిర్మల, గోపమ్మ, రేణుక, దుర్గా, చంద్రకళ, సంగమేశ్వరీ, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి పీఐబీ కృషి చేయాలి

- ఆరోగ్య బీమా పథకాలు విస్తరించాలి
- వృత్తి భద్రతకు చర్యలు అవసరం
- టీయూడబ్ల్యూజే సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో కృషి చేయాలని, దీనికి సంబంధించిన పథకాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులు (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి కోరారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో మంగళవారం "వార్తలాప్" వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ, ఇలాంటి వర్క్‌షాప్‌లు జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా వృత్తికి సంబంధించిన అనేక అంశాలు నేర్చుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలంలో జర్నలిజంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా జర్నలిస్టులు కూడా మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టులకు ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా విశేష ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అదే సమయంలో జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రతపై చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా సదుపాయాలను విస్తరించాలని సూచించారు. వార్తలను కవర్ చేసే సమయంలో ప్రమాదాలను లెక్కచేయకుండా జర్నలిస్టులు పనిచేస్తున్నారని, తమ కుటుంబం, జీవితాన్ని పక్కనబెట్టి వృత్తినిబద్ధతతో సేవలందిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో అనేకమంది గాయాల పాలవడం, మరణాలు సంభవించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి సందర్భాల్లో జర్నలిస్టుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటూ, ప్రమాద బీమా అమలు చేస్తే వారికి కొంతవరకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. ఈ విషయంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల భద్రతకు సంబంధించిన చర్యలను అమలు చేయడంతో పాటు, కేంద్ర అధికారులకు రాష్ట్ర అధికారులు నివేదించాలని కోరారు. అలాగే మరిన్ని వర్క్‌షాప్‌లను నిర్వహించి వృత్తి నైపుణ్యాన్ని గ్రామీణ స్థాయి వరకు విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై పీఐబీ అదనపు డీజీ శృతి పాటిల్ సానుకూలంగా స్పందించి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.



# ఘనంగా 'బేటీ జన్మోత్సవం'

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, మహిళా సాధికారత కేంద్రం సహకారంతో "బేటీ జన్మోత్సవ కార్యక్రమం" మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పుట్టిన ఆడ శిశువులను గౌరవిస్తూ బేటీ జన్మోత్సవ కిట్లు మరియు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీడబ్ల్యూఓ, డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆడపిల్లలు, మగపిల్లలను సమానంగా చూడాల్సిన అవసరాన్ని వివరించారు. పుట్టిన శిశువులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించి, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలనే ఇవ్వాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ నాగనిర్మల, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అనంతరం పటాన్‌చేరు ఏరియా ఆసుపత్రిలో ఈ కిట్లను బాలింతలకు అందజేశారు.

# కాకతీయుల నాటి పురాతన శివాలయం



**ముద్ర ప్రతినిధి మెదక్ :**

మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పన్నగుల్ల గ్రామంలో కాకతీయ శైలిలో ఉన్న పురాతన శివాలయం గుర్తించామని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు బుర్ర సంతోష్ తెలిపారు. ప్రస్తుతం పూర్తిగా ధ్శిథిలమైన స్థితిలో ఉన్న ఈ శివాలయంలో శివలింగం లేదని, అద్భుతంగా లతలు, సింహాలు, హంసలతో చెక్కిన మూడు గర్భద్వారాలు ఉన్నాయని తెలిపారు. శైవ ద్వారపాలకుల శిల్పాలు అద్భుతంగా అన్ని వైపులా ఉన్నాయన్నారు. గుడి చిత్రాలను పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ ఈ శివాలయం ఎర్లీ కాకతీయ శైలిలో ఉందని, ద్వార బంధాలలో లాలట బింబంగా గజలక్ష్మి ఉందని వెల్లడించారు. గుడి బయట నల్ల రాతి మీద చెక్కిన చతుర్భుజుడైన భైరవుడి శిల్పం ఉంది. మెదక్ జిల్లా గొప్ప చరిత్రను చాటేలా నిర్మించిన ఇలాంటి పురాతన వారసత్వ సంపదను కాపాడుకోవాలని బుర్ర సంతోష్ పిలుపునిచ్చారు.

### తిప్పన్నగుల్ల చరిత్ర..

తిప్పన్న గుల్ల గ్రామానికి ఈ పేరు స్థిరపడటానికి తిప్పుడు నిర్మించిన గుడులు కారణం. ఆ గుడి నిర్మాణాలు శిథిలావస్థలో ఉన్నప్పటికీ అద్భుతమైన కళాత్మక శిల్ప సంపద ఉట్టిపడుతున్నది. గుడికీ, గుడి శిథిలమవటానికీ చరిత్ర వుంది. తిప్పడు అనే దళితుడు సైనిక, పాలనాధికారిగా ఉంటూ ఈ దేవాలయ నిర్మాణం చేశాడని, పూర్తయిన తర్వాత గుడి పూజాది కార్యక్రమాల్ని ఇతరులు వెలివేయగా, ఆలయం శిథిలమవుతూ వచ్చిందని అతని పేరు మీద తిప్పనగుల్ల గ్రామనామం ఏర్పడిందని ప్రతీతి.



# చిన్న శంకరంపేట్ పోలీస్ స్టేషన్ తనిఖీ




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

చిన్న శంకరంపేట్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, వివిధ కేసుల్లో ఉన్న వాహనాల వివరాలను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరగాలని, స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఆదేశించారు. ఈ తనిఖీలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

**మలబద్దకం : ఒత్తిడి తగ్గించుకోవాలి**

మానసిక కుంగుబాటు (డిప్రెషన్) కూడా మలబద్ధకానికి కారణం అవుతుంది. ధ్యానం, ప్రశాంత జీవనం అవసరం.



# కొత్త రైతులకూ రైతు భరోసా

- అప్లికేషన్ల స్వీకరణ ప్రారంభం
- ఈ నెల 25 వరకు అవకాశం
- వ్యవసాయ శాఖకు డిజిటల్ ఫైల్

**ముద్ర. తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 22 నుంచి రైతు భరోసా నిధులను మూడు విడతల్లో జమ చేయనుంది. మొదటి విడతగా సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రక్రియను ప్రారంభిస్తారు. మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు గాను రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. కాగా, ఫిబ్రవరి 28, 2026 లోపు కొత్తగా పట్టా పొందిన రైతులు తమ ఆధార్, పాస్ బుక్ వివరాలతో రైతు వేదికల్లో రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రభుత్వం రైతు భరోసా పంట పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు రెడీ అయింది. త్వరలోనే ఆ డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయి. కాగా, ఇప్పటి వరకు రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందని రైతులకు సర్కార్ తీపి కబురు చెప్పింది. కొత్తగా రైతుల నుంచి రైతు భరోసా అప్లికేషన్లు



స్వీకరిస్తోంది. కొత్తగా పట్టా పొందిన రైతులు అంటే 28.02.2026 లోపు పట్టా పొందిన రైతులు కొత్తగా రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రైతు వేదికలు, వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి అప్లికేషన్లు ఇవ్వొచ్చు. అందుకు రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, రైతు భరోసా అప్లికేషన్ ఫారంతో పాటు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ ఫారంలో పూర్తి వివరాలు నింపి రైతు వేదికల్లో అందజేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కొత్తగా పట్టాలు పొందిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సలహా ఇస్తున్నారు.

కాగా, తెలంగాణ అన్నదాతకు రేవంత్ సర్కార్ ఇటీవల శుభవార్త చెప్పింది. ఈ నెల 22 నుంచి రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసా నిధులు విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో చర్చించారు. మొదటి విడతగా ఈ నెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి 70 లక్షల మంది రైతులకు ఎకరం వరకు రూ.3,590 కోట్లు నిధులను రైతుల ఖాతాల్లోకి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బదిలీ చేయనున్నారు.

తర్వాత మరో 20 రోజులకు రూ.2,650 కోట్లు రెండో విడతలో రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు మూడో విడత రైతు భరోసా పంట పెట్టుబడి సాయాన్ని వారి ఖాతాల్లోకి బదిలీ చేయనున్నారు. మొత్తంగా 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రభుత్వ నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు సిద్ధమవుతున్న తమకు ఈ సాయం ఆర్థికంగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కాగా, ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా నిధులు ఇస్తున్న సంగతి తెలిసిందే. ఏడాదిలో రెండుసార్లు రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.



## బిల్లులు చెల్లించి చిన్న పత్రికలను ఆదుకోండి

- ఆర్థిక మంత్రికి టీయుడబ్ల్యూజే వినతి

**ముద్ర హైదరాబాద్:**

చిన్న, మధ్యతరగతి పత్రికలకు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ కోరారు. మంగళవారం రోజు శాసన సభలోని ఛాంబర్ లో టీయుడబ్ల్యూజే ప్రతినిధి బృందం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. దాదాపు రెండేళ్లుగా చిన్న, మధ్యతరగతి పత్రికలకు బిల్లులు చెల్లించక పోవడంతో పడరాని తిప్పలు పడుతున్నారని, కనీసం కుటుంబంతో ఆనందంగా పండగ కూడా జరుపుకోలేని పరిస్థితిని అనుభవిస్తున్నారని విరాహత్ అలీ మంత్రి దృష్టికి తెచ్చారు. ఒక్క పెద్ద పత్రికకు చెల్లించే బిల్లుతో, వందలాది చిన్న, మధ్యతరగతి పత్రికలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగులో ఉన్న బిల్లుల ఫైలును వెంటనే క్లియర్ చేయాలని ఆయన కోరగా, భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని కిరణ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజినీ కాంత్ తదితరులు ఉన్నారు.

## వరి బోనస్ పై రైతులకు రూ.25వేలు ఆదా

- మహిళలకు రూ. 57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చాం
- బీఆర్ఎస్ నేతలకు ఆడబిడ్డలపై ఏమాత్రం గౌరవం లేదు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రైతు భరోసా కాకుండా ఒక్కో రైతుకు వరి ధాన్యం బోనస్ పేరిట రూ.25వేలు ఆదా అవుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. రైతుల శ్రమను గుర్తించి సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.ఐదొందల చొప్పున బోనస్ రైతుల ఖాతాలో వేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు వారి ఖాతాలో జమ చేశామన్న భట్టి.. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల కింద ఏడాదికి రూ. 20వేల కోట్ల పైగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు ఇప్పటివరకు వడ్డీ లేని రుణాల కింద రూ. 57 వేల కోట్లను మహిళల ఖాతాలో జమా చేశామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు మహిళలపై ఏమాత్రం గౌరవం ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. కేటీఆర్ ప్రతి సారి మహిళల మనసు గాయపరుస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మహిళల గురించి జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలని సూచించారు. మహిళల అభివృద్ధి గురించి వారికి శ్రద్ధ ఉంటే వారి క్యాబినెట్లో మహిళలకు అవకాశం కల్పించేవారన్నారు. వడ్డీ లేని రుణాల గురించి కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. వడ్డి లేని రుణాలకు సంబంధించిన చెక్కులు చెల్లించుకుంటూ పోతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామన్న భట్టి.. మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎన్ని అడ్డం కులు సృష్టించిన ముందుకు పోతూనే ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించిందన్న భట్టి.. మొదటి దశలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. వీటి నిర్మాణం కోసం రూ. 22,500 కోట్లు మంజూరు చేశామనీ ఇది దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజా ప్రభుత్వం అమలు చేసుకుంటూ ముందుకు పోతుందని తెలిపారు. కానీ టిఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఇంటికో ఉద్యోగం, దళిత సీఎం, భూమిలేని పేదలకు వ్యవసాయ భూమి పంపిణీ హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదు అన్నారు.





## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి పొంగులేటి
- అక్రిడిటేషన్ కమిటీలో పరిగణలోకి జర్నలిస్టుల సూచనలు
- టీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**ముద్ర, హైదరాబాద్ :**

రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ తో పాటు వెబ్ మీడియాలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తోన్న జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్ఏఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడేషన్ కార్డుల జారీలో, అక్రిడేషన్ కమిటీ ఏర్పాటులో, జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్న పొంగులేటి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.







# అట్టుడికిన అసెంబ్లీ

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ.. రచ్చ
- బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య పేలిన మాటల తూటాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ మంగళవారం తీవ్ర వాగ్వాదాలతో అట్టుడికింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు పరస్పరం విమర్శలు, ఆరోపణలు చేసుకున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలు, ఆరు గ్యారంటీల అమలు, ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు, డ్రగ్స్ అంశాలు సభలో హాట్ టాపిక్‌గా మారాయి.

మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల రుణాలు ఇచ్చామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పిన విషయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం ఆర్డర్ కాపీ చూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. లేనిపక్షంలో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు భట్టి విక్రమార్క రాజీనామా చేయాలని ప్రశ్నించారు. దీంతో సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

ఆరు గ్యారంటీల అమలు విషయంలో కూడా కేటీఆర్ ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని అన్నారు. అయినప్పటికీ పేదల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని చెప్పారు.

**ఎమ్మెల్యేల అనర్హతపై హాట్ డిబేట్**

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై కూడా సభలో చర్చ రగిలింది. ఈ విషయంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందిస్తూ తీర్పు పూర్తిగా చదివి మాట్లాడాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ నేతలు నిరంకుశత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారని విమర్శించారు.

**డ్రగ్స్ అంశంపై సవాల్**

రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై శాసనమండలిలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి టెస్టుకు సిద్ధమని ప్రకటిస్తూ, ప్రతిపక్ష నేతలు కూడా ముందుకు రావాలని సవాల్ విసిరారు.

**రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ గళం**

రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానం సమర్పించారు. గ్రాట్యుటీ, జీపీఎఫ్ తదితర బకాయిలు చెల్లించకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**ఇతర రాజకీయ వ్యాఖ్యలు**

హ్యామ్ రోడ్ల పేరిట రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని హరీశ్ రావు ఆరోపించగా, అసలు టెండర్లే పిలవనప్పుడు అవినీతి ఎలా జరుగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు.

ఇక ఈనెల 22 నుంచి రాష్ట్రంలోని 60 లక్షల మందికి పైగా రైతులకు రైతుభరోసా నిధులు జమ చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.

అసెంబ్లీ చర్చలో ఆరోపణలు, ప్రతియారోపణలు, రాజీనామా సవాళ్లతో రాజకీయ వేడి మరింత పెరిగింది.

## రంజాన్ వేళ రక్తపాతం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ దాడి..
- 400 మంది మృతి..
- తీవ్రంగా ఖండించిన భారత్..

**ముద్ర డెస్క్ :**

కాబూల్‌లో రంజాన్ సమయంలో జరిగిన ఘోర వైమానిక దాడి ప్రపంచాన్ని కుదిపేసింది. మాదకద్రవ్య విముక్తి ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకున్న ఈ దాడిలో సుమారు 400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరికొందరు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందిస్తూ, ఇది పిరికిపంద చర్య అని ఖండించింది. అఫ్గాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని స్పష్టం చేసింది. అఫ్గాన్ క్రికెటర్ రషీద్ ఖాన్ కూడా దీనిని “యుద్ధ నేరం”గా అభివర్ణిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. పాక్ మాత్రం తాము సైనిక లక్ష్యాలపైనే దాడి చేశామని చెప్పినప్పటికీ, భారీ ప్రాణనష్టం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. దక్షిణ ఆసియాలో శాంతి కోసం ఇలాంటి దాడులు ఆగాలని పలు దేశాలు కోరుతున్నాయి.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడిని పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ముద్ర పెబ్బేరు**

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని మాజీ మండల కో ఆప్షన్ మెంబర్ తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయులు యూసుఫ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హాస్పటల్లో అడ్మిట్ అయి చికిత్స పొంది ఇటీవలే ఇంటికి చేరుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి చేరుకొని పరామర్శించారు.ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులకు పండ్లు ఫలహారాలు తినిపించారు సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, ఉప సర్పంచ్ కళ్యాణ ఖారి ఖాజా, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటస్వామి, పర్వతాలు, విష్ణుసాగర్, శివసాగర్ ,వెంకటేష్, షఫీ, సయ్యద్ ,గౌడ నాయక్ ,సుదర్శన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
18.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



మలబద్ధకం : పాల ఉత్పత్తులు తగ్గించాలి (కొంతమందికి)

పాలు, చీజ్ వంటి వాటిని అధికంగా తీసుకుంటే కొందరిలో మలబద్ధకం పెరుగుతుంది.




## ఓఎక్స్ఎంఐక్యూ ల్యాబ్స్, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ ఒప్పందం

**ముద్ర, బిజినెస్ :**

ప్రపంచంలోనే అతిపెద్ద పునరుత్పాదక విద్యుత్ ఆధారిత భారీ స్థాయి ఏఐ కంప్యూట్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసేందుకు ఓఎక్స్ఎంఐక్యూ ల్యాబ్స్, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ (ఏఎంఐ) వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం 2030 నాటికి 2 గిగావాట్ ఏఐ కంప్యూట్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకోగా, తొలి దశలో 1 గిగావాట్ హబ్‌ను నోయిడాలో ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో విద్యుత్ వ్యయాలు సంప్రదాయ డేటా సెంటర్ వ్యయాలతో పోలిస్తే 5070 శాతం వరకు తక్కువగా ఉండనున్నాయి. ఈ హబ్ పూర్తిగా సమగ్ర ఏఐ మౌలిక వేదికగా రూపుదిద్దుకోనుంది. స్వంత విద్యుత్ ఉత్పత్తి నుంచి డేటా సెంటర్‌లు, ఏఐ ప్రాసెసర్లు, సాఫ్ట్‌వేర్ వరకు ఒకే వ్యవస్థగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ఒప్పందం కింద కంప్యూట్ ప్లాట్‌ఫాంకి సంబంధించిన ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్ భాగస్వామిగా ఓఎక్స్ఎంఐక్యూ వ్యవహరించనుంది. హార్డ్‌వేర్ రోడ్‌మ్యాప్, సప్లై చైన్ వ్యూహాల రూపకల్పనలో ఏఎంఐ ల్యాబ్స్‌తో కలిసి పని చేయనుంది. ఇప్పటికే నోయిడాలో తొలి దశ కంప్యూట్ హబ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రాథమిక కంప్యూట్ సామర్థ్యం 2027 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పర్యావరణహిత విద్యుత్ రంగ సంస్థ గ్రీన్‌కో మాతృ సంస్థ ఏఎం గ్రూప్‌లో ఏఎంఐ ల్యాబ్స్ భాగంగా ఉంది. జీపీయూ ఆర్కిటెక్చర్, ఏఐ టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న ఓఎక్స్ఎంఐక్యూ ల్యాబ్స్‌ను రాజా కోడూరి స్థాపించారు. "హార్డ్‌వేర్, సిస్టమ్స్ పరంగా ఓఎక్స్ఎంఐక్యూకి ఉన్న అనుభవం ఏఎంఐ ల్యాబ్స్‌కు దోహదపడుతుంది" అని ఏఎం గ్రూప్ చైర్మన్ అనిల్ చలమశెట్టి తెలిపారు. ఏఎంఐ ల్యాబ్స్‌ను పూర్తి స్థాయి ఏఐ కంప్యూట్ ప్లాట్‌ఫాంగా అభివృద్ధి చేయడానికి సమిష్టిగా పునాది వేస్తున్నామని చెప్పారు. ఇక, ఓఎక్స్ఎంఐక్యూకి ఏఎంఐ ల్యాబ్స్ సరైన భాగస్వామి అని, గ్లోబల్ స్థాయిలో విశ్వసనీయంగా కర్బన రహిత విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకువచ్చే సామర్థ్యం ఉందని ఓఎక్స్ఎంఐక్యూ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, సీఈవో రాజా కోడూరి తెలిపారు.




## డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

- **జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**
- **వార్తలాప్ వర్క్‌షాప్‌తో జర్నలిస్టులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన**
- **పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

ప్రస్తుత డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా తయారవుతున్న కంటెంట్, తప్పుదారి పట్టించే చిత్రాలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించి నిజమైన వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో "వార్తలాప్" పేరుతో జర్నలిస్టులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగ ఆధారిత హింస, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జర్నలిజంలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 130 మంది జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్న తప్పుదారి పట్టించే సమాచారం కూడా సమాజంలో భయం, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని తెలిపారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమని పేర్కొంటూ, ప్రభుత్వ పాలసీలు, పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని అన్నారు. నైతిక విలువలతో కూడిన నాణ్యమైన వార్తలను అందించాలని సూచించారు. ఈ తరహా వర్క్‌షాప్‌లు జర్నలిస్టులు నూతన పరిజ్ఞానాన్ని తెలుసుకుని తమ వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల అధికారిక సమాచారాన్ని ప్రజలకు ఖచ్చితంగా చేరవేయడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న ఈ కాలంలో తప్పుడు వార్తలను గుర్తించి ఖండించడంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ముఖ్యమైన బాధ్యత నిర్వర్తిస్తున్నదని వివరించారు. లింగ సమానత్వం, మహిళల సంక్షేమ పథకాలపై సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల మాట్లాడుతూ, లింగ సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని, పిల్లల్లో సరైన దృక్పథాన్ని తల్లిదండ్రులు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో ఏఐ వినియోగంపై సత్యప్రియ వివరిస్తూ, నోట్‌బుక్ కేఎల్ఎం, చాట్ జీపీటీ, గూగుల్ పిన్‌పాయింట్, ఎలెవన్ లాబ్స్, జెమినీ ఏఐ వంటి పలు సాధనాల వినియోగంపై అవగాహన కల్పించారు. అయితే ఏఐ వేదికలపై వ్యక్తిగత లేదా సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్క్‌షాప్ ముగింపులో జర్నలిస్టులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ సమాధానాలు ఇచ్చి, వారి సూచనలు, అభిప్రాయాలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు చేరవేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం నాయకులు బండారి యాదగిరి, విష్ణు ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, పానుగంటి కృష్ణ, సీనియర్ జర్నలిస్టు మధు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రోమాండ్ల అనిల్ కుమార్, ఆందోల్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మునిపల్లి యాదగిరి, కశివరత్నం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు ప్రాంతాల్లో 11 ఎకరాలను కాపాడిన హైడ్రా


- **రూ. 1650 కోట్ల విలువైన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రభుత్వం, ప్రజావసరాల కోసం కేటాయించిన 11 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్‌లో వీటి విలువ రూ. 1650కోట్లు ఉంటుందని అంచనా. ఇందులో 2 ఎకరాలు పార్కు కోసం కేటాయించగా, 5 ఎకరాలు స్మశాన వాటికకు, మరో 4 ఎకరాలు డంపింగ్ యార్డుకు సంబంధించినవి ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సెంట్రల్ పార్క్ కాలనీలో పార్కు కోసం 2 ఎకరాలు కేటాయించారు. సర్వే నంబరు 110/1లో 148 ప్లాట్లతో 16 ఎకరాల మేర 'సెంట్రల్ పార్క్ కాలనీ ఫేజ్ 1' పేరుతో 1998లో లేఔట్ వేశారు. ఇందులో 2 ఎకరాలను పార్కు కోసం కేటాయించగా, మున్సిపల్ అధికారులు పార్కు స్థలంగా హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. అయితే ఈ స్థలం తమదేనంటూ కొంతమంది ఆక్రమణలకు పాల్పడుతూ, కాలనీ వాసులు అడ్డుకుంటే బెదిరింపులకు దిగిన ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. 2 ఎకరాల పార్కు స్థలాన్ని ధృవీకరించి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం పార్కులో తాత్కాలికంగా నిర్మించిన షెడ్లను తొలగించింది. అనంతరం 2 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, పార్కు స్థలంగా బోర్డులు ఏర్పాటు చేసింది.

ప్రగతినగర్‌లో 9 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ..ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువుకు ఆనుకుని ఉన్న 5 ఎకరాల స్మశాన వాటికతో పాటు, పక్కనే ఉన్న 4 ఎకరాల డంపింగ్ యార్డు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా విచారణ చేపట్టింది. రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కూకట్‌పల్లి మండలం బాగామేరి గ్రామం సర్వే నంబరు 103లోని ఈ భూమిని స్మశాన వాటిక, చెత్త డంపింగ్ యార్డు కోసం కేటాయించినట్లు నిర్ధారించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు 9 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, 5 ఎకరాల్లో స్మశాన వాటిక స్థలంగా, మిగిలిన 4 ఎకరాల్లో ప్రభుత్వ స్థలంగా బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రగతినగర్




చెరువుకు ఆనుకుని ఉన్న ఈ భూమిని కబ్జాల నుంచి కాపాడిన హైడ్రాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఫిర్యాదులు ఇచ్చినా పరిష్కారం కాలేదని, హైడ్రా జోక్యంతో సమస్య పరిష్కారమైందని సంతోషం వ్యక్తం చేశారు.

## మధ్యాహ్న భోజన పథకం మోనును వంద శాతం అమలు చేయాలి

- **ప్రహరీలు లేని పాఠశాలల జాబితా తయారు చేసి ఇవ్వాలి**
- **కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ముద్ర, నారాయణ పేట:**




జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ శాఖల వసతి గృహాలలో మధ్యాహ్న భోజన పథకం మోను ను కచ్చితంగా వంద శాతం అమలు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యం, ఇతర వంట సరకులు పూర్తి స్థాయిలో నాణ్యతతో కూడినవి వినియోగించాలన్నారు. జిల్లా అధికారులతో తీసుకుంటున్న తొలి సమావేశం విద్య పైనే అని.. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజనం మరియు డైట్ ప్లాన్ అమలుపై కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి మంగళ వారం సాయంత్రం ఆయన జిల్లా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 17 నుంచి 21 లోపు వారికి నోడల్ అధికారులు/మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్ ల పర్యవేక్షణ చేసి, విజిట్ రిపోర్ట్ ను తప్పనిసరిగా గూగుల్ ఫార్మ్ లో నివేదిక పంపించాలని సూచించారు. దీనిని అత్యంత ప్రాధాన్యతగా భావించి కేటాయించిన గడువులోపు విజిట్ లను పూర్తి చేయాలన్నారు. ఇకపై మండలానికి ఒక తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఎస్. ఐ తో కూడిన అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు, ఆ కమిటీ వారం లో రెండుసార్లు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి అక్కడి మౌలిక వసతి సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించాలని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఆయా పాఠశాలలు,వసతి గృహాల విద్యార్థులతో కలిసి వారంలో కచ్చితంగా రెండుసార్లు మధ్యాహ్న భోజనం చేసి నాణ్యత, రుచిని పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో కొన్ని పాఠశాలలకు ప్రహరీలు సరిగ్గా లేవని, అసాంఘిక కార్య కలాపాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రహరీలు లేని పాఠశాలల జాబితా తయారు చేసి ఇవ్వాలన్నారు. వసతి గృహాల లోపలికి ఎవ్వరిని అనుమతించరాదని మరీ ముఖ్యంగా బాలికల వసతి గృహాల లోపలికి ఎవ్వరిని అనుమతించ వద్దని తేల్చి చెప్పారు. అవసరమైతే బాలికల వసతి గృహాల బయట లోపలికి వెళ్లడానికి ఎవరికి అనుమతి లేదనే ఫ్లెక్సీలు పెట్టాలని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రోటోకాల్ తప్పని సరిగా పాటించాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. ఆర్ బీ ఎస్ కే బృందాలు క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఎక్కడెక్కడ శిబిరాలు నిర్వహించారో నివేదిక తీసుకోవాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షలను సజావుగా కొనసాగించాలని, పరీక్షా కేంద్రాల లోపలికి ఇన్విజిలేటర్లు ఎవ్వరూ సెల్ ఫోన్లు తీసుకు వెళ్లరాదని, కేంద్రాల్లోకి సెల్ ఫోన్ల అనుమతి లేదన్నారు.



## వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

**ముద్ర, గద్వాల:**

గద్వాల మండలం కొండపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో రైతు శాస్త్రవేత్త చర్చ, శిక్షణ కార్యక్రమము (ఆత్మ సౌజన్యంతో) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైత విజ్ఞాన కేంద్రం, మహబూబ్ నగర్ శాఖ డాక్టర్ అర్చన మేలైన పంటలు పత్తి, మిరప, కంది, మొక్కజొన్న తదితర పంటల పై వచ్చే తెగుళ్లు, చీడ పీడల గురించి, వాటి నివారణ గురించి రైతులతో చర్చించారు. పంటల పై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి పరిచారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ జగ్గునాయక్ ప్రకృతి వ్యవసాయం గురించి, పంటలపై ఇష్టానుసారంగా పురుగు మందులను రైతులు వాడుతున్నారని, దీని వల్ల కాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని, రైతులు పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు, వేప నూనెలను పంటలకు విరివిగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎడిఎ సంగీత లక్ష్మీ, గ్రామ సర్పంచ్ క్రిష్ణారెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మి నారాయణ, మండల వ్యవసాయాధికారి... ప్రతాప్ కుమార్, ఎఇఓ అనుషా, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విశ్వబ్రహ్మణ మండల అధ్యక్షుడు మృతి

**ముద్ర, గద్వాల:**

గద్వాల పట్టణం రాజీవ్ మార్గ్ లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేటిదొడ్డి మండలం విశ్వబ్రహ్మసమన్వయకర్త సదానందం చారీ(44) మృతి చెందారు. మంగళవారం సాయంత్రం రాజీవ్ మార్గ్ లో బైక్ పై వెళ్తున్న సదానందం ఓ బ్యాంక్ వద్ద రోడ్డు క్రాస్ చేసే క్రమంలో ప్లై ఓవర్ నుంచి పాతబస్టాండ్ వైపు వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో బైక్ పై వెళ్తున్న సదానందం సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాని గద్వాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

**దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.**

బాలల హక్కుల కోసం నిరంతరం శ్రమించిన ఎంవిఎఫ్ కార్యకర్త, ఎంవిఎఫ్ మండల కోఆర్డినేటర్ అయిన సదానందం విద్యార్థుల పక్షాన నిలబడి, ప్రతి బాలలు పాఠశాలకు వెళ్లేలా కృషి చేసిన గొప్ప వ్యక్తి అని మండల ప్రజలు పేర్కొన్నారు. సదానందం మృతి పట్ల కేటిదొడ్డి మాజీ ఎంపీపీ మనోరమ్మ, గంగన్‌పల్లి సర్పంచ్ పైటాల నర్సింహులు, మండల నాయకులు, జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సొరియాసిస్ బాధితులకు మెరుగైన వైద్యం

- **ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర అమెరికా విభాగం అధికారి రిక్ ఆస్ట్రోకట్**

**ముద్ర న్యూస్ :**




సొరియాసిస్‌కు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన చికిత్సా అవకాశాలు అందించడమే తమ లక్ష్యమని అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర అమెరికా విభాగం ప్రధాన కార్యనిర్వాహక అధికారి రిక్ ఆస్ట్రోకట్ తెలిపారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఇవ్వబడే ఈ బయోలాజికల్ ఔషధం సొరియాటిక్ ఆర్థ్రైటిస్ చికిత్సలో ప్రత్యేక ఎంపికగా మారాలని ఆశిస్తున్నామని చెప్పారు. భారతదేశానికి చెందిన ప్రముఖ ఔషధ సంస్థ సన్ ఫార్మస్యూటికల్ ఇండస్ట్రీస్ తయారు చేసిన బయోలాజికల్ ఔషధం 'ఇలుమ్యా'ను సొరియాటిక్ ఆర్థ్రైటిస్ అనే కీళ్ల వ్యాధి చికిత్సకు ఉపయోగించేందుకు సమర్పించిన అదనపు బయోలాజికల్ అనుమతి దరఖాస్తును సమీక్షకు స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ దరఖాస్తుపై తుది నిర్ణయం ఈ ఏడాది అక్టోబర్ 29 నాటికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ దరఖాస్తు రెండు అంతర్జాతీయ మూడో దశ వైద్య పరిశోధనల ఫలితాల ఆధారంగా సమర్పించబడిందన్నారు. ఈ పరిశోధనల్లో ప్రపంచవ్యాప్తంగా అనేక వైద్య కేంద్రాల్లో పాల్గొన్న రోగులపై 52 వారాలపాటు ఔషధ ప్రభావం, భద్రతను పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు ఒక లక్ష నలభై వేల మంది రోగులు ఈ ఔషధంతో చికిత్స పొందారు. ఐదేళ్ల పాటు కొనసాగిన పరిశీలనలో దీని ప్రభావం స్థిరంగా ఉండటంతో పాటు భద్రతా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. అయితే ఈ ఔషధం వాడకంలో అరుదుగా తీవ్రమైన అలర్జీ ప్రతిక్రియలు, ఇన్ఫెక్షన్ల ప్రమాదం వంటి దుష్ప్రభావాలు కనిపించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. చికిత్స ప్రారంభానికి ముందు క్షయ వ్యాధి వంటి ఇన్ఫెక్షన్ల కోసం పరీక్షలు చేయడం అవసరమని, చికిత్స సమయంలో ఎలాంటి ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కాగా ఈ ఔషధం ఇప్పటికే మోస్తరు నుంచి తీవ్రమైన ప్లాక్ సొరియాసిస్‌తో బాధపడుతున్న పెద్దలకు చికిత్సగా 2018లో అనుమతి పొందింది. ఇప్పుడు అదే ఔషధాన్ని సొరియాటిక్ ఆర్థ్రైటిస్ చికిత్సకు కూడా వినియోగించేందుకు అనుమతి లభిస్తే, సొరియాసిస్‌తో బాధపడుతున్న వారిలో మూడింట ఒక వంతు మందికి కనిపించే కీళ్ల నొప్పులు, వాపు వంటి సమస్యలను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుందని సంస్థ పేర్కొంది.

**మలబద్ధకం :**
అవసరమైతే సహజ లాక్సేటివ్స్ ఉపయోగించాలి ఇసబ్గోల్ , త్రిఫల వంటి సహజ పదార్థాలు మలాన్ని సాఫీగా చేయడంలో సహాయపడతాయి.







# ఐపీఎల్ 2026 రివ్యూ :
## సన్‌రైజర్స్ హైదరాబాద్ సత్తా ఎంత?

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

హైదరాబాద్: ఐపీఎల్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు భారీ అంచనాలతో సిద్ధమవుతోంది. 2016లో టైటిల్ గెలిచిన ఈ జట్టు, గత కొన్నేళ్లుగా స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోయినా, ఈసారి కొత్త ప్లేయర్లతో బలంగా కనిపిస్తోంది. పాట్ కమిన్స్ నాయకత్వంలో జట్టు బలంగా ఉన్నప్పటికీ, అతని వెన్నునొప్పి జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. అతను తొలి మ్యాచ్‌లకు దూరమైతే అభిషేక్ శర్మ లేదా ఇషాన్ కిషన్ కెప్టెన్సీ చేపట్టే అవకాశం ఉంది. బ్యాటింగ్‌లో హెయిన్‌రిచ్ క్లాసెన్, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లు జట్టుకు ప్రధాన బలం. నితీష్ కుమార్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రతిభతో కీలక పాత్ర పోషించనున్నాడు. అయితే బౌలింగ్ విభాగంలో స్థిరత్వం లేకపోవడం జట్టుకు బలహీనతగా మారింది. డేనియల్ వెటోరి కోచింగ్‌లో జట్టు శిక్షణ శిబిరం నిర్వహిస్తూ లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తోంది. గత వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకున్న హైదరాబాద్ ఈసారి ట్రోఫీపై కన్నేసింది. మరి అభిమానుల అంచనాలను ఈసారి జట్టు నిజం చేస్తుందా లేదా అన్నది ఐపీఎల్ ప్రారంభం తర్వాతే స్పష్టమవుతుంది.

# ఇషాన్.. అభిషేక్.. సన్ రైజర్స్ కెప్టెన్ ఎవరు?

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కెప్టెన్సీపై ఉత్కంఠ నెలకొంది. ప్రధాన కెప్టెన్ పాట్ కమిన్స్ గాయం కారణంగా ప్రారంభ మ్యాచ్‌లకు దూరంగా ఉండే అవకాశాలు ఉన్న నేపథ్యంలో, కొత్త సారథి ఎవరనే దానిపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా అభిషేక్ శర్మను తాత్కాలిక కెప్టెన్‌గా నియమించే అవకాశాలున్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. గత సీజన్లలో అతడి అద్భుత ప్రదర్శన, ఓపెనర్‌గా స్థిరమైన ఆట కారణంగా మేనేజ్‌మెంట్ అతని వైపు మొగ్గుచూపుతున్నట్టు సమాచారం.

ఇదిలా ఉండగా ఇషాన్ కిషన్ పేరు కూడా రేసులోకి వచ్చింది. డొమెస్టిక్ క్రికెట్‌లో నాయకత్వ అనుభవం ఉన్న ఇషాన్‌కు కూడా కెప్టెన్సీ ఇవ్వాలని కొంతమంది మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. అయితే జట్టు యాజమాన్యం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. కమిన్స్ ఫిట్‌నెస్, జట్టు సమతౌల్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ప్రస్తుతం కావ్య మారన్ అభిషేక్ శర్మ వైపే ఎక్కువ ఆసక్తి చూ

# టీ20 ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ ప్లేయర్ అతనే

*** డివిలియర్స్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీ20 క్రికెట్‌లో ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాడిగా టీమిండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను సౌతాఫ్రికా మాజీ స్టార్ ఏబీ డివిలియర్స్ అభివర్ణించాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మ్యాచ్‌ను గెలిపించే సామర్థ్యం బుమ్రాకు ఉందని పేర్కొన్నాడు.

కొత్త బంతి, డెత్ ఓవర్లు, సూపర్ ఓవర్ వంటి కీలక సందర్భాల్లోనూ బుమ్రా అద్భుతంగా రాణిస్తాడని చెప్పాడు. ఒత్తిడిలో వికెట్లు తీయగల అతని ప్రతిభ ప్రత్యేకమని కొనియాడాడు. సరదాగా తనకు బౌలింగ్ చేయనంత వరకే బుమ్రా గొప్ప బౌలర్ అని వ్యాఖ్యానించాడు. బ్యాటింగ్ దిగ్గజాలను పక్కనబెట్టి ఒక బౌలర్‌ను ఎంపిక చేయడం ఈ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. టీ20ల్లో బుమ్రా గణాంకాలు కూడా అతని ప్రాధాన్యతను చూపిస్తున్నాయి. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ స్థాయిలో కీలక సందర్భాల్లో జట్టుకు విజయాలు అందిస్తూ కీలక ఆటగాడిగా నిలుస్తున్నాడు. ఇక పాకిస్థాన్ మాజీ పేసర్ ఆకిబ్ జావేద్ చేసిన పోలికపై కూడా చర్చ నడుస్తోంది. బుమ్రా బౌలింగ్ శైలి ప్రత్యేకతను ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు అభిమా



# సంజు శాంసన్ కు అక్షరాల 24.23 కోట్లు..

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

టీమిండియా విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించినందుకు సంజు శాంసన్ కు మెన్ అఫ్ ది సిరీస్ పురస్కారం లభించింది. ఈ క్రమంలోనే సంజు పంట పండుతోంది. ఏకంగా అతడు 24.23 కోట్లను ఈ ఏడాది సంపాదిస్తున్నాడు. ఐపీఎల్ 2026 లో అతడు చెన్నై జట్టుకు ఆడుతున్నాడు. చెన్నై జట్టు అతడికి 18 కోట్లను చెల్లిస్తోంది. టి20 వరల్డ్ కప్ గెలవడం ద్వారా ప్రైజ్ మనీ రూపంలో బీసీసీఐ సంజు కు ఆరు కోట్లను ఇస్తోంది. ఇక ఐసిసి టి20 వరల్డ్ కప్ ప్రైజ్ మనీ రూపంలో 23 లక్షల ఇస్తుంది. మొత్తంగా అతడు 24.23 కోట్లను సంపాదిస్తున్నాడు. వాస్తవానికి తన స్థాయి ఆటగాళ్లతో పోల్చి చూస్తే సంజు ఏకంగా 24.23 కోట్లను సంపాదించడం నిజంగా గొప్ప విషయం. టి20 వరల్డ్ కప్ లో రింకు సింగ్ విఫలం కావడం.. అభిషేక్ శర్మ కొన్ని మ్యాచ్లలో చేతులెత్తేయడంతో సంజు కు జట్టులో అవకాశం లభించింది. వచ్చిన అవకాశాన్ని సంజు సద్వినియోగం చేసుకున్నాడు. మెరుపు వేగంతో బ్యాటింగ్ చేశాడు. అంతేకాదు.. జట్టు విజయాలలో ముఖ్య పాత్ర పోషించాడు. కీలకమైన ప్లేయర్లు చేతులెత్తేసిన వేళ.. అతడు దీపశిఖలాగా నిలబడ్డాడు.



# ధోనీ నన్ను వారించి అదే చేశాడు

*** అంబటి రాయుడు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో సీఎస్‌కే మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై అంబటి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఫెయిర్ ప్లే విషయంలో ఒకసారి తనను మందలించిన ధోనీ, తర్వాత అదే పరిస్థితిలో తానే మైదానంలోకి వచ్చాడని తెలిపాడు. ఓ కార్యక్రమంలో మాట్లాడిన రాయుడు, అంపైర్ల నిర్ణయాలపై తాను తరచూ స్పందించేవాడినని, ఆ సమయంలో ధోనీ తనను ఆపాడని వివరించాడు. బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టాలని, అనవసర వాగ్వాదాలు చేయొద్దని సూచించాడని చెప్పాడు. అయితే అదే సీజన్‌లో నోబాల్ వివాదంపై ధోనీ స్వయంగా మైదానంలోకి వచ్చాడని గుర్తు చేశాడు. ఆ ఘటనను సరదాగా ప్రస్తావిస్తూ తన అనుభవాన్ని పంచుకున్నాడు. ఇక మ్యాచ్‌ల్లో జరిగే ఘర్షణల గురించి మాట్లాడుతూ, ఆటలో అలాంటి సంఘటనలు సహజమని, జట్టు సభ్యులు ఒకరికొకరు మద్దతుగా నిలుస్తారని రాయుడు పేర్కొన్నాడు.

# అది నా లక్కీ టీమ్



*** గంభీర్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

కోల్‌కతా నైట్‌రైడర్స్ తనకు లక్కీ టీమ్ అని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పేర్కొన్నాడు. ఆ జట్టుతో ఉన్న అనుబంధం తన కెరీర్‌లో కీలక మలుపు తీసుకువచ్చిందని తెలిపాడు.టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ విజేతగా నిలవడంలో గంభీర్ కీలక పాత్ర పోషించాడు. జట్టు ఎంపిక నుంచి వ్యూహాల అమలు వరకు ముందుండి నడిపించాడు. దీంతో ఆటగాడిగా, కోచ్‌గా ప్రపంచకప్ గెలిచిన ఘనతను సాధించాడు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ మాట్లాడుతూ, కేకేఆర్‌తో తన ప్రయాణమే తన ఎదుగుదలకు కారణమని వెల్లడించాడు. మెంటార్‌గా బాధ్యతలు చేపట్టిన సీజన్‌లో జట్టు విజేతగా నిలవడం తన కెరీర్‌కు కొత్త దారులు తెరిచిందని చెప్పాడు. అదే విజయంతో భారత జట్టు హెడ్ కోచ్ పదవి దక్కిందని గంభీర్ పేర్కొన్నాడు. కోల్‌కతా జట్టుతో పాటు ఆ నగరంతో తనకు ప్రత్యేకమైన బంధం ఉందని తెలిపాడు.

# ఐపీఎల్ కోసం రోహిత్ శర్మ ప్రాక్టీస్ ప్రారంభం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్‌కు రోహిత్ శర్మ సన్నాహాలు ప్రారంభించాడు. ఇటీవల కుటుంబంతో కలిసి మాల్దీవుల్లో విరామం గడిపిన అతడు స్వదేశానికి చేరుకున్న వెంటనే ముంబై జట్టుతో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో మాట్లాడిన తర్వాత మైదానంలోకి దిగిన రోహిత్ నెట్స్‌లో కసిగా శ్రమించాడు. బ్యాటింగ్‌లో రక్షణాత్మక షాట్లు, భారీ హిట్స్‌పై ప్రత్యేకంగా సాధన చేశాడు. అనంతరం ఫీల్డింగ్‌లోనూ పాల్గొన్నాడు. గత సీజన్‌లో మంచి ప్రదర్శన కనబరిచిన రోహిత్ ఈసారి జట్టుకు బలమైన ఆరంభాలు ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఐపీ ఎల్ ప్రారంభానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో తన ఫిట్‌నెస్, ఫామ్‌పై దృష్టి పెట్టాడు. కెప్టెన్‌గా ముంబై జట్టును ఐదు సార్లు టైటిల్ దిశగా నడిపించిన రోహిత్ ప్రస్తుతం హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు. 2013లో సారథ్య బాధ్యతలు స్వీకరించిన అతడు విజయవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందాడు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
18.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మలబద్ధకం : సమస్య ఎక్కువకాలం ఉంటే వైద్యుడిని సంప్రదించాలి**

మూడు నెలలకు పైగా సమస్య కొనసాగితే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించడం అత్యంత ముఖ్యం.






## పెద్దిలో స్పెషల్ సాంగ్‌పై సస్పెన్స్

ఏప్రిల్ 30 రిలీజ్ డేట్ దగ్గరపడుతుండడంతో దర్శకుడు బుచ్చిబాబు తీవ్ర టైమ్ ప్రెజర్‌లో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇంకా షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్, రీరికార్డింగ్, ప్రమోషన్స్ అన్నీ పూర్తి చేయాల్సి ఉండగా, ముఖ్యంగా స్పెషల్ సాంగ్ ఇంకా తెరకెక్కించకపోవడం ఆసక్తికరంగా మారింది. ఈ పాట కోసం హీరోయిన్లను ఫైనల్ చేయడంలో దర్శకుడు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని సమాచారం. మొదట మృణాల్ ఠాకూర్ పేరు వినిపించినా, తర్వాత ఎలాంటి అప్డేట్ లేకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. ఒకే హీరోయిన్ కాకుండా ఇద్దరు ముగ్గురు హీరోయిన్లతో స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారని టాక్. అయితే స్టార్ హీరోయిన్ల డేట్స్ సెట్ చేయడం కష్టంగా మారడంతో ఈ ప్రణాళిక అమలు కాస్త సవాలుగా మారింది. ఇక మరోవైపు రిలీజ్ డెడ్‌లైన్ దృష్ట్యా వచ్చే పది రోజుల్లో ఈ అంశంపై క్లారిటీ తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఏప్రిల్ మూడో వారానికి ఫస్ట్ కాపీ సిద్ధం చేసి, తర్వాత ప్రమోషన్స్‌పై ఫోకస్ పెట్టాలని టీమ్ భావిస్తోంది. ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ కూడా త్వరగా ప్రారంభించాల్సి ఉండటంతో, ఇప్పుడు యూనిట్ వేగంగా పనులు పూర్తిచేసే ప్రయత్నాల్లో ఉంది.

## అడ్వాన్స్ బుకింగ్స్‌లో రికార్డులు..

**'ధురంధర్ 2'కు భారీ ఓపెనింగ్స్ పక్కా..!**

రణవీర్ సింగ్ హీరోగా, ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే భారీ కలెక్షన్లు సాధిస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. పెయిడ్ ప్రివ్యూలతో పాటు ముందస్తు టికెట్ అమ్మకాల ద్వారా ఇప్పటికే వంద కోట్ల మార్క్ దాటినట్లు సమాచారం. ఉగాది సందర్భంగా విడుదల కానున్న ఈ చిత్రానికి ఒకరోజు ముందుగానే ప్రివ్యూలు ప్లాన్ చేయగా, టికెట్లు వేగంగా అమ్ముడయ్యాయి. ప్రివ్యూల ద్వారా రూ.40 కోట్లకు పైగా, మొదటి రోజు అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా దాదాపు రూ.29 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. విదేశాల్లో కూడా మంచి స్పందన లభించడంతో మొత్తం కలెక్షన్లు రూ.130 కోట్లకు చేరుకున్నట్లు ట్రేడ్ టాక్ వినిపిస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 15 వేల థియేటర్లలో విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ఇప్పటివరకు లక్షల్లో టికెట్లు అమ్ముడయ్యాయి. తెలుగు సహా పలు భాషల్లో విడుదల కానున్న ఈ మూవీ నిడివి దాదాపు నాలుగు గంటలకు చేరువలో ఉందన్న ప్రచారం సాగుతోంది. అయితే సెన్సార్, అధికారిక రన్‌టైమ్‌పై స్పష్టత కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## చిరు, పవన్ అనుబంధం మాటల్లో చెప్పలేం: హరీశ్ శంకర్

మెగాస్టార్ చిరంజీవి, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైందని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' ట్రైలర్ చూసిన తర్వాత చిరంజీవి తనకు ఫోన్ చేసి చాలా సేపు మాట్లాడారని, ఆ సమయంలో ఆయన చూపిన ఆనందం మాటల్లో చెప్పలేనిదని తెలిపారు. డైలాగులు, సన్నివేశాల గురించి ఒక్కొక్కటిగా చెప్పడం ద్వారా పవన్‌పై ఆయనకు ఉన్న ప్రేమ ఎంత గొప్పదో అర్థమైందని చెప్పారు. పవన్ కళ్యాణ్‌ను చిరంజీవి కేవలం తమ్ముడిగా మాత్రమే కాకుండా, కొడుకులా భావిస్తారనే విషయం ఆ సంభాషణలో స్పష్టంగా కనిపించిందని హరీశ్ వివరించారు. ఈ ఇద్దరి మధ్య ఉన్న బాంధవ్యాన్ని పదాల్లో చెప్పడం కష్టం అని, అది ఒక ప్రత్యేకమైన భావన అని పేర్కొన్నారు. వారి మధ్య ఉన్న ఈ అనుబంధం అభిమానుల్లో కూడా ఎప్పుడూ ప్రత్యేకమైన భావోద్వేగాన్ని కలిగిస్తుందని హరీశ్ శంకర్ తెలిపారు. అలాగే పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వంపై కూడా హరీశ్ శంకర్ ప్రశంసలు కురిపించారు. పని పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, ప్రతి సన్నివేశాన్ని సహజంగా చూపించాలనే పట్టుదల ప్రత్యేకమని చెప్పారు. చిన్న డైలాగ్‌కైనా పలుమార్లు రిహార్సల్ చేస్తూ, పర్ఫెక్ట్‌గా రావాలనే తపనతో పనిచేస్తారని తెలిపారు. ఇలాంటి లక్షణాలే పవన్‌ను ప్రత్యేకంగా నిలబెడతాయని హరీశ్ శంకర్ అన్నారు.



## మందాకిని స్టైల్‌లో మెరిసిన ప్రియాంక చోప్రా!

హాలీవుడ్ గ్లామర్ ఈవెంట్లలో ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా నిలిచే ప్రియాంక చోప్రా, ఈసారి వానిటీ ఫెయిర్ ఆస్కార్ పార్టీ 2026లో తన స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. మందాకిని వైబ్స్‌ను తలపించేలా ఆమె కనిపించిన తీరు ఫ్యాషన్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వేడుకకు భర్త నిక్ జోనాస్‌తో కలిసి హాజరైన ప్రియాంక, గోల్డ్ కలర్ మెరుస్తున్న గౌన్‌లో గ్లామర్‌కు కొత్త అర్థం ఇచ్చింది. బ్యాక్‌లెస్ డిజైన్‌తో పాటు బాడీ ఫిట్ స్టైల్ ఆమె ఫిగర్‌ను హైలైట్ చేస్తూ, మరింత ఆకర్షణీయంగా చూపించింది. ఈ డ్రెస్‌లో ఆమె స్టైల్, కాన్ఫిడెన్స్ ప్రత్యేకంగా కనిపించాయి. సాఫ్ట్ వేవ్స్‌లో హెయిర్ స్టైలింగ్, గ్లోయింగ్ మేకప్‌తో ప్రియాంక తన లుక్‌ను మరింత ఎలివేట్ చేసింది. మొత్తం మీద ఆమె ప్రెజెన్స్ ఈ ఈవెంట్‌లో హైలైట్‌గా నిలిచింది. గ్లామర్, గ్రేస్ కలిసిన ఈ లుక్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది.

## త్రిష పెళ్లిపై హింట్ ఇచ్చిన ఉమా కృష్ణన్

టీవీకే పార్టీతో రాజకీయాల్లో బిజీగా ఉన్న విజయ్ వ్యక్తిగత జీవితం మళ్లీ వార్తల్లో నిలిచింది. ఆయన భార్య సంగీత విడాకుల కోసం కోర్టు వెళ్లడం, ఒక నటితో సహజీవనం చేస్తున్నాడని ఆరోపించడం నేపథ్యంలో త్రిష పేరు బయటకు రావడంతో, ఇద్దరి సంబంధంపై తమిళ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇటీవల వీరిద్దరూ కలిసి ఒక వివాహ వేడుకకు హాజరవడం ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వైరల్ అయిన ఏఐ పెళ్లి వీడియోకు త్రిష తల్లి ఉమా కృష్ణన్ లైక్ చేయడం కొత్త చర్చకు దారి తీసింది. దీంతో విజయ్–త్రిష పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవన్నీ పుకార్లేనని కొందరు చెబుతుండగా, ఎన్నికల తర్వాత ఈ విషయంపై క్లారిటీ రావచ్చని టాక్ వినిపిస్తోంది.





## బాలీవుడ్ ఎంట్రీపై సాయిపల్లవి టెన్షన్.. 'ఏక్ దిన్'పై భారీ అంచనాలు

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన సాయిపల్లవి ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీతో కొత్త పరీక్షను ఎదుర్కొంటోంది. మలయాళం, తెలుగు, తమిళ చిత్రాల్లో వరుస విజయాలతో మంచి పేరు సంపాదించిన ఈ భామ, హిందీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా 'ఏక్ దిన్' సినిమా ఆమె కెరీర్‌లో కీలకంగా మారనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. థాయ్ చిత్రానికి రీమేక్‌గా తెరకెక్కిన ఈ మూవీలో జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవికి ఇది బాలీవుడ్‌లో మొదటి అడుగు కావడంతో ఫలితంపై ఆసక్తి పెరిగింది. ఈ సినిమా విజయం సాధిస్తే హిందీలో మరిన్ని అవకాశాలు రావడం ఖాయం అని, లేకపోతే కెరీర్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## కెడి డెవిల్' పాటపై వివాదం..

**బూతు లిరిక్స్‌పై నెటిజెన్ల ఆగ్రహం**

కన్నడ ప్యాన్ ఇండియా చిత్రం 'కెడి డెవిల్' నుంచి విడుదలైన 'సర్కే చునర్ తేరి సర్కే' పాట చుట్టూ వివాదం చెలరేగుతోంది. తెలుగు గాయని మంగ్లీ పాడిన ఈ హిందీ వెర్షన్ సాంగ్‌లో ఉన్న లిరిక్స్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ద్వంద్వార్థాలతో నిండిన సాహిత్యం, బోల్డ్ చిత్రీకరణపై నెటిజెన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు రీల్స్‌లో ఇలాంటి పాటలను అనుకరిస్తే పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తున్నారు. ధృవ్ సర్జ హీరోగా, దర్శకుడు ప్రేమ్ తెరకెక్కిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం ఇప్పటికే పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గతంలో 'మార్టిన్' ఫ్లాప్ ప్రభావం కూడా ఈ సినిమాపై పడిందన్న టాక్ ఉంది. ఇక తాజాగా పాట వివాదం రావడం నిర్మాతలకు కొత్త తలనొప్పిగా మారింది. విడుదల తేదీ ఇంకా ఖరారు కాకపోవడంతో పాటు ఇతర ప్రాజెక్ట్‌ల ఆలస్యం నేపథ్యంలో 'కెడి డెవిల్' పరిస్థితి ఎలా మారుతుందో చూడాలి.





## ఇతరుల జీవితాల్లోకి తొంగిచూడకండి

**విజయ్–త్రిష రూమర్స్‌పై ఖుష్బూ ఫైర్..**

తమిళ స్టార్ విజయ్, నటి త్రిష వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో వస్తున్న రూమర్స్‌పై సీనియర్ నటి ఖుష్బూ తీవ్రంగా స్పందించారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఇతరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. త్రిష గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఆమె ఎంతో మృదుస్వభావి, హుందాగా ప్రవర్తించే వ్యక్తి అని ప్రశంసించారు. అలాంటి వ్యక్తిపై ఆధారంలేని ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. ఇప్పటి సోషల్ మీడియా పరిస్థితిపై కూడా ఖుష్బూ అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న విషయాన్నే పెద్ద వివాదంగా మార్చే పరిస్థితి ఏర్పడిందని, కొందరు ఇతరుల గురించి తప్పుగా ప్రచారం చేస్తూ ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. సెలబ్రిటీల ప్రైవసీని గౌరవించాల్సిన అవసరం ఉందని, అనామకంగా కామెంట్లు చేసే వారిని పట్టించుకోవద్దని త్రిషకు సూచించారు. విజయ్ రాజకీయాల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ రూమర్స్ ప్రభావం ఉంటుందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ, ప్రజలకు ఎవరికీ ఓటు వేయాలో తెలుసని చెప్పారు. ఒకరి వ్యక్తిగత జీవితం, రాజకీయాలను కలిపి చూడడం సరికాదని ఖుష్బూ స్పష్టం చేశారు. ఈ వ్యవహారం పూర్తిగా వ్యక్తిగతమని, దాన్ని అనవసరంగా పెద్దది చేయకూడదని ఆమె అభిప్రాయపడ్డారు.

## బాలీవుడ్ తెరపై మరో సూపర్ హీరో మూవీ..

**40 ఏళ్ల తర్వాత అదే పాత్రలో జాకీ ష్రాఫ్**

బాలీవుడ్‌లో సూపర్ హీరో చిత్రాల జోరు కొనసాగుతోంది. తాజాగా జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ది గ్రేట్ గ్రాండ్ సూపర్ హీరో: ఏలియన్స్ కా ఆగమన్' సినిమా ఈ జానర్‌లో మరో ఆసక్తికర ప్రయత్నంగా నిలవనుంది. ఫాంటసీ, కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదలై ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది. ఈ సినిమాలో జాకీ ష్రాఫ్ సూపర్ హీరోగా కనిపించనుండటం ప్రత్యేకత. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఆయన ఈ తరహా పాత్రలో నటిస్తుండగా, కథలో ఏలియన్స్ ఎలిమెంట్ కూడా ఉండటం విశేషం. ఒక బాలుడు తన తాతయ్య రహస్య శక్తుల గురించి చెప్పడం చుట్టూ కథ తిరుగుతుందని టీజర్ ద్వారా తెలుస్తోంది. 2026 వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.



## ఉస్తాద్ ఈవెంట్‌లో రాశి ఖన్నా గ్లామర్ షో..

'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరగగా, అందులో హీరోయిన్ రాశి ఖన్నా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హెవీ ఎంబ్రాయిడరీ లెహంగా ధరించి, అందుకు తగ్గ జువెలరీతో స్టేజ్‌పై అడుగుపెట్టిన ఆమె అందరి దృష్టిని ఆకర్షించింది. నైట్ ఈవెంట్‌కు తగ్గట్టు స్టైలిష్ లుక్‌లో మెరిసిన రాశి, సింపుల్ స్మైల్‌తోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ వేడుకలో ఆమె లుక్‌కు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా రాశి ఖన్నా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈ సినిమా కథ వినకుండానే పవన్ కళ్యాణ్ కోసం ఒప్పుకున్నానని చెప్పిన ఆమె, మరోసారి అలాంటి అవకాశం వస్తే ఎవరితో చేస్తారని అడిగితే మహేష్ బాబు పేరు చెప్పింది. దీంతో ఈ కాంబినేషన్ ఎప్పుడెప్పుడు చూస్తామా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com